www.vaarthavedhikasurya.com

PRGI.NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 1 | సంచిక: 330 | ఆదివారం, 26 ఏప్రిల్, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 1 | ISSUE : 330 | SUNDAY, APRIL 26, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## అమెరికా-ఇరాన్ మధ్య రెండోదఫా చర్చల్లేవ్

• పాకిస్థాన్‌కు వచ్చి వెళ్లిపోయిన అరాగ్చీ • ఆ దేశ ప్రధాని, సైన్యాధ్యక్షుడితో సమావేశం • మరోవైపు, అమెరికా ప్రతినిధుల పర్యటన రద్దు



2 లో..




## ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ

• దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి • ఇంజనీరింగ్ ఎగుమతుల్లో 117.9 శాతం వృద్ధితో దేశంలో అగ్రస్థానంలో తెలంగాణ • యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీతో భాగస్వామ్యానికి స్కైరూట్ సంసిద్ధత • వచ్చే ఏడాది నుంచి నెలకో రాకెట్: స్కైరూట్

### 2047 నాటికి ఏరోస్పేస్ రంగంలో ప్రపంచంలో అగ్రగామిగా..

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 25:

ఏరోస్పేస్ హబ్‌గా త్వరలో తెలంగాణ అవతరించనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' ఫ్లైట్ హార్డ్‌వేర్‌ను శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఉన్న ప్రయోగ స్థలానికి పంపే కార్యక్రమాన్ని మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ రాకెట్‌ను శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్‌లో స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించింది. ఇది శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో ఉన్న ప్రయోగ స్థలానికి లాంఛనంగా బయలుదేరింది. దీంతో రాబోయే నెలల్లో భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగానికి స్కైరూట్ సిద్ధం కానుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లేందుకు భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు ఆర్బిటల్ ప్రయోగం చేయడానికి స్కైరూట్ సిద్ధంగా ఉండటం హర్షణీయమన్నారు. దీనిని హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం ఏరోస్పేస్ రంగంలో రాష్ట్ర మిగతా 2లో..

## కేసీఆర్ మర మనిషి

### తోడేళ్లు, గుంటనక్కల చేతిలో బందీ.. అవినీతి పందికొక్కులను పక్కనే పెట్టుకొని.. నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు

• కాళేశ్వరంలో అవినీతి అని చెప్పినందుకే నా సస్పెన్షన్ • హైడ్రా పేరుతో ఇళ్లు కూల్చేస్తుంటే.. ప్రజలు పిలిచినా బయటకు రాలేదు • ఆనాటి పాలనలో భాగమైనందుకు సిగ్గుపడుతున్నా • బీఆర్ఎస్‌లో ఆత్మ పోయింది.. అందుకే టీఆర్ఎస్ పెట్టాను • రాష్ట్రంలో కాంగ్రెస్‌ది కర్కోటక పాలన • సామాజిక న్యాయంపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు.. • తెలంగాణ ప్రజలు అవకాశమిస్తే 'అమ్మ'లా చూసుకుంటటా • మునీరాబాద్ సభలో కల్వకుంట్ల కవిత • పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేనగా' ప్రకటన • పసుపు, నీలం, ఆకుపచ్చ రంగులతో పార్టీ జెండా




మేడ్చల్/హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 25:

''బీఆర్ఎస్ కోసం నా చెమట, రక్తం, సమయం ధారపోసి పనిచేశా. కష్టపడి తెలంగాణ తెచ్చుకున్నం. కానీ, మనం కలలు కన్న తెలంగాణ రాలేదు. మన కలలు ఇప్పటికీ నిజం కాలేదు. కేసీఆర్ ఆధ్వర్యంలో ఉద్యమ రథం దారి తప్పింది. సామాజిక రథ చక్రం విరిగి ముక్కలైంది. ఆనాటి కేసీఆర్ వేరు. ఈనాటి కేసీఆర్ వేరు. ఆనాడు చేనేత కార్మికులు చనిపోతే.. బిచ్చమెత్తి సాయం చేసిన వ్యక్తి కేసీఆర్. ఈనాటి కేసీఆర్ మర మనిషి, మారిన మనిషి'' అంటూ తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన మన మనిషి కాదని, గుంట నక్కలు, తోడేళ్ల చేతిలో బందీగా ఉన్నారని, ఆత్మ లేని మరబొమ్మగా మారారని ఆక్షేపించారు. ఇవి సంతోషంతో చెబుతున్న మాటలు కాదని, దుఖంతో చెబుతున్న మాటలని అన్నారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో శనివారం ఉదయం పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించారు. తమ పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)గా ప్రకటించారు. అనంతరం సభలో మాట్లాడుతూ.. ఈరోజు తన జీవితంలో మరచిపోలేని రోజు అవుతుందని మిగతా 2లో..




## భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 25:

రాష్ట్రంలో మరోసారి భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. హైదరాబాద్ కలెక్టర్ హరి చందన కార్మిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా వెళ్లారు. హరిచందన స్థానంలో ప్రియాంక హైదరాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆర్అండ్‌బీ ప్రావీణ్య, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా కృష్ణ ఆదిత్య, ఐఅండ్ పీఆర్ ప్రత్యేక కార్యదర్శిగా జి.ముకుంద్ రెడ్డి, ఇంటర్ బోర్డు డైరెక్టర్‌గా అభిలాష్ అభినవ్, ఆరోగ్య శ్రీ సీఈఓగా అభివన్ హనుమంతు కొడింబా నియమితులయ్యారు. తెలంగాణ భవన్ ప్రత్యేక అధికారిగా సంజయ్ కుమార్ ఎంపికయ్యారు. సీసీఎల్ఏ కార్యదర్శిగా అపూర్వ్ చౌహన్. ములుగు కలెక్టర్ జి.హెచ్ సహదేవ్ రావు, నాగర్ కర్నూల్ హెచ్ కే పాటిల్. ఏటూరు నాగారం ఐటీడీఏ పీవోగా లెనిన్ వత్సల్, రంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా.. కుమరం భీం అసిఫాబాద్ అదనపు కలెక్టర్‌గా యువరాజ్. గిరిజన సంక్షేమ శాఖ మిగతా 2లో..

## నేటి నుంచి జనగణన

• వచ్చే నెల 10వ తేదీ వరకు అవకాశం.. • ప్రత్యేక పోర్టల్‌లో సులువుగా వివరాల నమోదు • ఆన్‌లైన్‌లో 15-20 నిమిషాల్లో పూర్తి • నివాసం ఉన్న చోటే వివరాలు నమోదు చేసుకోవాలి • జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికేరి

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 25:

జనగణనలో భాగంగా పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు (స్వీయ గణన) చేసుకొనే ప్రక్రియను రాష్ట్రంలో నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. ఈ అవకాశం వచ్చే నెల 10వ తేదీ వరకు ఉంటుందని చెప్పారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో స్వీయ జనగణనకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం భారతి మాట్లాడు తూ.. స్వీయ గణనలో తెలంగాణ పౌరులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సందేహాలుంటే 1855 నెంబరుకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. 15 నుంచి 20 నిమిషాల్లో ఆన్‌లైన్‌లో స్వీయ జనగణన పూర్తి చేయవచ్చని తెలిపారు. 33 ప్రశ్నలకు సంబంధించిన సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.




### మే 11 నుంచి హెచ్ఎల్‌వో

జనగణన మొదటి విడతలో భాగంగా కాలనీలు, బస్తీలు, వార్డు/గ్రామం, మండలం వారీగా హౌస్ లిస్టింగ్ బ్లాక్ (హెచ్ఎల్‌బీ)ల మ్యా పింగ్ పూర్తయ్యిందని భారతి హోళికేరి చెప్పారు. మే 11వ తేదీ నుంచి జూన్ 9 వరకు నిర్వహించే హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (హెచ్ఎల్‌వో)లో భాగంగా బ్లాకులవారీగా ఇళ్లకు నెంబర్లు కేటాయిస్తామన్నారు. ఇందులో భాగంగా కుటుంబ యజమాని, ఇంటిలోని సదుపాయాలతో పాటు మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించి సమాచారం సేకరిస్తామని తెలిపారు. రెండో దశలో 2027 ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత వివరాల సేకరణ ఉంటుందని వివరించారు. స్థానికులతోపాటు విదేశీయులు, మిగతా 2లో..



## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

• తాజాగా యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్ కె.శివకుమార్‌కు నోటీసులు • దర్యాప్తును వేగవంతం చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 25:

తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసులో సాక్ష్యాధారాల సేకరణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా మరో కీలక వ్యక్తికి నోటీసులు జారీ చేసింది. యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్, టీటీడీ మాజీ సభ్యులైన కె. శివకుమార్ ఈ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ విచారణను ఎదుర్కోనున్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక సమాచారం సేకరించేందుకు శివకుమార్‌కు అధికారులు నోటీసులు పంపారు. మే 28వ తేదీన విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ విచారణ జరగనుందని సిట్ మిగతా 2లో..




## నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా లాహిరి

• పునర్వ్యవస్థీకరణలో బెంగాల్‌కు ప్రాధాన్యం • ఆ రాష్ట్రంలో పాగా వేసేందుకు కేంద్రం ఎత్తుగడ!

2 లో..

## సేవా ఇనామ్ భూమి వక్ఫ్ ఆస్తే దాన్ని అన్యాక్రాంతం చేయలేరు

• సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: మసీదులకు అనుబంధంగా ఉండే సేవా ఇమామ్‌ల భూములు వక్ఫ్ ఆస్తిలో భాగమని, అందువల్ల వాటిని అన్యాక్రాంతం చేయలేమని సుప్రీంకోర్టు శుక్రవారం తెలిపింది. మతపరమైన లేదా ధార్మిక ప్రయోజనాల కోసం సేవా ఇనామ్‌గా మంజూరు చేసిన భూములు దాన ఆస్తి స్వభావాన్ని సంతరించుకుంటాయని, ప్రజా లేదా మతపరమైన ట్రస్టును కలిగి ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం మిగతా 2లో..




## హెచ్-1బీ వీసాలను మూడేళ్లు ఆపండి

• అమెరికా కాంగ్రెస్‌లో బిల్లు

వాషింగ్టన్, ఏప్రిల్ 25: హెచ్-1బీ వీసా జారీ కార్యక్రమాన్ని మూడేండ్లపాటు నిలిపివేయాలని రిపబ్లికన్ నేతలు అమెరికా కాంగ్రెస్‌లో బిల్లును ప్రవేశపెట్టారు. హెచ్-1బీ వీసాల జారీ వల్ల విదేశీ కార్మికులు చౌకగా అందుబాటులోకి వస్తున్నారని, దీనివల్ల అమెరికా వర్కర్లకు ఉద్యోగాలు లేకుండా పోతున్నాయని ఆ బిల్లులో సభ్యులు ప్రతిపాదించారు. అరిజోనాకు చెందిన రిపబ్లికన్ నేత ఎలీ క్రేన్ 2026 హెచ్-1బీ వీసా యాక్ట్ బిల్లును తీసుకొచ్చారు. ఆయనకు మిగతా 2లో..

## మే 9న రాష్ట్రానికి ప్రధాని మోదీ

పలు జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 25:

వచ్చే నెల 9న ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా పలు జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రాజెక్టుల జాబితా సిద్ధమవుతోంది. ఈ కార్యక్రమం అనంతరం హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసే సభలో మోదీ పాల్గొంటారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి రాష్ట్రానికి వస్తుండడంతో బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

సంపుటి: 1 సంచిక: 330 వార్త వేదిక సూర్య ఆదివారం, 26 ఏప్రిల్, 2026

# ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)





అభివృద్ధికి ఒక మైలురాయి అని పేర్కొన్నారు. ఈ సంస్థ 2022లో తన తొలి రాకెట్‌ను ప్రయోగించిందని, ఇంత తక్కువ సమయంలోనే ఆర్బిట్ ప్రయోగ దశకు చేరుకోవడం సంతోషకరమని అన్నారు. ''ఏరోస్పేస్ రంగంలో తెలంగాణ ఇప్పటికే దేశంలో ప్రథమ స్థానంలో ఉంది. బోయింగ్, ఎయిర్‌బస్, సాఫ్రాన్ వంటి ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలకు నిలయంగా మారింది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2023-24 నుంచి 2024-25 మధ్య కాలంలో దేశంలో ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతుల్లో తెలంగాణ 117.9 శాతం అత్యధిక వృద్ధిని నమోదు చేసింది. ఈ వృద్ధిలో విమాన విడిభాగాలు, రక్షణ పరికరాలే ప్రధానంగా దోహదపడ్డాయి'' అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. 2047 నాటికి ఏరోస్పేస్ రంగంలో ప్రపంచ అగ్రగామిగా ఎదగడమే తెలంగాణ లక్ష్యమన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని సీఎం రేవంత్ తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ), పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తెస్తామని ప్రకటించారు. టాటా టెక్నాలజీస్ సహకారంతో ఇప్పటికే ఏటీసీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని మల్లేపల్లిలో ఉన్న ఏటీసీని సందర్శించి తమకు కావాల్సిన నైపుణ్యాలను సూచించాల్సిందిగా స్కైరూట్ సంస్థను సీఎం ఆహ్వానించారు. తక్కువ సమయంలోనే ఆర్బిటల్ ప్రయోగ దశకు చేరుకున్న స్కైరూట్ బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడంలేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించిందని రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. స్కైరూట్ ఏరోస్పేస్ సీఈవో పవన్‌కుమార్ చందన మాట్లాడుతూ.. యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీతో భాగస్వామ్యానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ విక్రమ్-1 రాకెట్‌ను వచ్చే జూన్‌లో నింగిలోకి పంపించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రాకెట్‌ను శ్రీహరికోటలోని ఇస్రో సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించనున్నట్లు స్కైరూట్ సహ వ్యవస్థాపకులు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా వెల్లడించారు. 23 మీటర్ల పొడవైన ఈ రాకెట్‌ను అభివృద్ధి చేయటానికి నాలుగేళ్లు పట్టిందని, ప్రస్తుతం తుది దశ పరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. విక్రమ్-1 పేలోడ్ సామర్థ్యం 350 కేజీలకు వరకు ఉందని, అయితే త్వరలో ప్రయోగించబోయే రాకెట్‌లో మాత్రం 100 కేజీల లోపు పేలోడ్‌ను ఉపయోగించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఫ్లైట్ డేటాను సేకరించే చిన్న శాటిలైట్స్‌ను నింగిలోకి పంపించనున్నట్లు చెప్పారు. విక్రమ్-1 ప్రయోగం తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాటిలైట్ ఆపరేటర్ల కోసం వాణిజ్యపరమైన కార్యకలాపాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వచ్చే ఏడాది నుంచి నెలకో రాకెట్‌ను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు.

# కేసీఆర్ మర మనిషి

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. బీఆర్ఎస్‌లో ఆత్మ పోయిందని, అందుకే తన పార్టీకి తెలంగాణ రాష్ట్ర సేన అనే పేరు పెట్టానని చెప్పారు. 'బీఆర్ఎస్ నుంచి కేసీఆర్ తొలి ముఖ్యమంత్రి అయ్యారు. మంచి సాలు తీయాల్సి ఉండె. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెచ్చుకున్న తెలంగాణలో పదేళ్లలో నీళ్ల కోసం బీఆర్ఎస్ లక్షా 89 వేల కోట్లు ఖర్చు చేసింది. కేవలం 14 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చింది. పాలమూరు, కాళేశ్వరం ప్రాజెక్టుల కోసమే లక్షా 21 వేల కోట్లు ఖర్చు చేసింది. కేంద్రంతో గొడవ పెట్టుకోకపోయి ఉంటే పాలమూరు- రంగారెడ్డి పూర్తయ్యేది'' అని వ్యాఖ్యానించారు.

ప్రజలకు కష్టం వస్తే కూడా కేసీఆర్ బయటకు రావడం లేదని, 'అయ్యా కేసీఆర్ రావాలి' అని పిలిచినా రావట్లేదని కవిత తప్పుబట్టారు. ''వెలుగుమట్లలో, హైదరాబాద్‌లో ఇళ్లు కూల్చేస్తే వచ్చారా!? 'అయ్యా కేసీఆర్' రావాలి అంటే కూడా రాలేదు. నాడు ఆర్డీఎస్ కోసం పాదయాత్ర చేశారు. కానీ, పాలమూరు కోసం ఏమీ చేయలేదు. ఆనాటి కేసీఆర్ అయితే అక్కడే కుర్చీ వేసుకొని దాన్ని పూర్తి చేసేవారు. ఆనాటి కేసీఆర్ వేరు. ఈనాటి కేసీఆర్ వేరు. నాడు చేనేత కార్మికులు చనిపోతే బిక్షమెత్తి సాయం చేశారు. సింగరేణి గనిలో కార్మికుడు చనిపోతే చూసి వచ్చారు. ఇప్పుడు ఎక్కడ చిన్న కష్టం వచ్చినా ఆ సారు రారు. చేవెళ్ల దగ్గర కష్టమేస్త వచ్చారా? ఇప్పుడు ఆయన మారిన మనిషి. మర మనిషి. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆ ప్రేమ ఏమైంది!? అధికారం ముందు మమకారం తగ్గిపోయిందా!?'' అని నిలదీశారు. ఎప్పుడైతే అధికారం వచ్చిందో అప్పుడే బీఆర్ఎస్‌లో అమ్మతనం, మమకారం పోయిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కర్కోటక పాలకుడి పాలన నడుస్తోందని, అర్ధరాత్రి ఇళ్లు కూలగొడుతుంటే ఆదుకోవాల్సిన మన పాత కేసీఆర్ ఎక్కడ ఉన్నాడని నిలదీశారు. తనను ఓడించడం ద్వారా ప్రజలు తప్పు చేశారని కేసీఆర్ అంటున్నారని, మన పిల్లలు తప్పు చేస్తే వదిలేస్తామా!? అని నిలదీశారు. కేసీఆర్ రాజకీయ పరిణతి కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. మారిన కేసీఆర్ పంజాబ్,గుజరాత్, బిహార్‌కు పోయారని, రాష్ట్రంలో మొత్తం పీకి కట్టలు కట్టామని నేషనల్ పార్టీ అంటూ వెళ్లారని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ప్రజలను పట్టించుకోలేదని, పట్టించుకుని ఉంటే పాలమూరు రంగారెడ్డి పారకపోయేదా!? అని ప్రశ్నించారు. ఇక, కేటీఆర్‌కు పెద్దగా ఏమీ తెలియదని కవిత తీసిపారేశారు. రేవంత్ రెడ్డి కర్కోటక, నియంత సీఎం అని కవిత మండిపడ్డారు. ''అన్ని అనుమతులూ ఉన్నా వెలుగుమట్లలో ప్రజల ఇళ్లను కూల్చేశారు. ఆ బాధతో ఒక గర్భిణికి అబార్షన్ అయింది. రెండు నెలల చిన్నారిని కాళ్లతో తన్ని చంపితే ఇప్పటికీ కేసు పెట్టలేదు. గురుకులాల్లో విషం పెట్టి విద్యార్థులను చంపుతుంటే ప్రభుత్వం స్పందించటం లేదు. కర్ల రాజేశ్‌ను లాకప్ డెత్ చేస్తే ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. అందుకే రేవంత్‌ను కర్కోటక, నియంత ముఖ్యమంత్రి అంటున్నాను'' అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇప్పుడున్న మూడు పార్టీలూ కుటుంబ పాలన, అవినీతి, బంధుప్రీతితో నిండిపోయాయని చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయటం కాంగ్రెస్ అజెండా అయితే పెద్ద సార్ ఫామ్‌హౌస్‌లో ఉండి.. చిన్న సార్‌ను సీఎం చేయాలన్నది బీఆర్ఎస్ అజెండా అని ఆరోపించారు. సామాజిక న్యాయాన్ని ఖతం పట్టించటమే బీజేపీ సింగిల్ పాయింట్ అజెండా అని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షం తామేనని, రెండేళ్ల తర్వాత అధికారంలోకి వస్తామన్నారు. బీజేపీకి తెలంగాణ రావటమే ఇష్టం లేదని, తల్లిని చంపి బిడ్డను తీశారని బీజేపీ పెద్దలు అంటూ ఉంటారని కవిత విరుచుకుపడ్డారు. మెడకాయ మీద తలకాయ లేని ఒక ఎంపీ తెలంగాణ ఏర్పాటును భారత్, పాక్ విభజనతో పోల్చారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ''అగ్రనాయకత్వం అలా మాట్లాడినా బీజేపీ బానిస ఎంపీలు ఒక్కమాట మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి బీజేపీ'' అని విమర్శించారు. మహిళా బిల్లు, బీసీ బిల్లు, కులగణన బిల్లు తొక్కి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం కారణంగా భద్రాచలం వద్ద ఐదు గ్రామాలు మునిగిపోయే పరిస్థితి ఉందని, అవి ఏపీకి పోయినా బీజేపీ బానిస ఎంపీలు పెదవులు తెరవడం లేదని మండిపడ్డారు. తెలంగాణ బిడ్డలైతే.. సిగ్గుంటే రాముని గుడి మునిగిపోకుండా ఐదు గ్రామాలను తెలంగాణకు తీసుకురావాలని బీజేపీ ఎంపీలకు సవాల్ విసిరారు. తనను పార్టీ నుంచి బయటకు పంపిస్తే వెంటనే పార్టీ పెట్టలేదని, మారతారేమోనని పది నెలలపాటు ఎదురు చూశానని కవిత చెప్పారు. ఆనాడు ఉద్యమకారులకు జరిగిందే ఇప్పుడు తనకూ జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ కోసం ఇళ్లు, భూములు అమ్ముకున్న వాళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మనల్ని లాఠీలతో కొడితే తల్లి కోడిలా కాపాడుకోవాల్సిన కేసీఆర్ ఎక్కడకు పోయారని ప్రశ్నించారు.

# నేటి నుంచి జనగణన

(మొదటి పేజీ తరువాయి)

ఇతర రాష్ట్రాలు, జిల్లాల వారు కూడా ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రాంతంలోనే జనగణనలో పాల్గొనాలని సూచించా రు. జనగణన డాటా.. సమాచార హక్కు చట్టం పరిధిలోకి రాద ని, పౌరుల వ్యక్తిగత వివరాలు అత్యంత గోప్యంగా ఉంటాయని భారతి చెప్పారు. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డు నెంబర్లు, ఇతర డాక్యుమెంట్లను ఎన్యుమరేటర్లు అడగరని చెప్పారు. సమాచారం ఇవ్వకుంటే చట్ట ప్రకారం జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు.

స్వీయగణన ప్రక్రియ ఇలా..

https://se.census.gov.in పోర్టల్ లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి.

రాష్ట్రం (తెలంగాణ) ఎంపిక చేసి.. దిగువన కనిపించే క్యాప్చా ఎంటర్ చేయాలి.

కుటుంబ యజమాని పేరు నమోదు చేయాలి. యజమాని పేరు ఒక్కసారినమోదు చేస్తే సవరణకు అవకాశం ఉండదు.

కుటుంబంలోని ఎవరిదైనా మొబైల్ నెంబరుఎంటర్ చే యాలి. ఒక మొబైల్ నెంబరుతో ఒక కుటుంబం వివరాల నమో దుకు మాత్రమే అవకాశం ఉంటుంది.

ఈ మెయిల్ ఎంటర్ చేయాలి (ఆప్షనల్). అనంతరం మొ బైల్ నెంబరుతోపాటు ఈ మెయిల్‌కు ఐడీ నెంబరు వస్తుంది.

కావాల్సిన భాషను ఎంచుకొని.. పైన ఎంటర్ చేసిన మొబైల్ నెంబరుకు వచ్చే వన్‌టైం పాస్‌వర్డ్ (ఓటీపీ)ఎంటర్ చేయాలి. ఒకసారి భాష ఎంచుకున్న తర్వాత మార్చడం కుదరదు.

జిల్లాను ఎంచుకొని పిన్‌కోడ్, గ్రామం/నగరం, ప్రాంతం, స్థానిక ల్యాండ్‌మార్క్ ఎంటర్ చేసి సెర్చ్‌పై క్లిక్ చేయాలి.

ఆయా వివరాల ఆధారంగా కనిపించే మ్యాప్‌లో ఎర్రటి రం గులో కనిపించే మార్కర్ ద్వారా మీ ఇల్లు ఎక్కడ ఉందో సరిగా గుర్తించాలి. (భవనంపై మార్కర్ ఉండేలా ఎంచుకోవా లి). వివరాలు సేవ్ చేసి నెక్ట్స్‌పై క్లిక్ చేయాలి. ఇది ఎన్యుమరేటర్ క్షేత్రస్థాయి పర్యటనలో మీ ఇంటికి సులువుగా వచ్చేందుకు దోహదపడుతుంది.

అనంతరం 33 అంశాలకు సంబంధించిన ప్రశ్నలు వస్తా యి. ఇందులో 27 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. భవనం నెంబరు, సెన్సస్ హౌస్ నెంబరు వంటి ప్రశ్నలకు ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు సమాచారం ఇవ్వాలి.

మీరు ఇచ్చిన సమాచారం సరిగా ఉందా..? లేదా..? అన్నది ప్రివ్యూ ఆప్షన్‌పై క్లిక్ చేసి చెక్ చేసుకోవాలి.

అంతా సక్రమంగా ఉందనుకుంటే ఫైనల్ సబ్‌మిట్‌పై క్లిక్ చేయాలి. సవరణ కావాలంటే ఎన్యుమరేటర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఇంటికి వచ్చినప్పుడు చేసుకోవాలి.

ఫైనల్ సబ్‌మిట్ చేసిన తర్వాత హెచ్ అనే అక్షరంతోపాటు 11 అంకెలతో ఐడీ నెంబరు మొబైల్ నెంబరు/ఈ మెయిల్‌కు వస్తుంది.

ఈ గుర్తింపు సంఖ్యను ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు చెబితే యాప్‌లో చెక్‌చేసి.. మీ వివరాలకు సంబంధించిన సమాచారం క్రా స్‌చెక్ చేస్తారు. అనంతరం మీ స్వీయ జనగణనను ఆమోదిస్తూ.. సబ్‌మిట్ చేయడంతో జనగణన నమోదు ప్రక్రియ పూర్తవుతుంది.

# నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా లాహిరి

## పునర్వ్యవస్థీకరణలో బెంగాల్‌కు ప్రాధాన్యం

## ఆ రాష్ట్రంలో పాగా వేసేందుకు కేంద్రం ఎత్తుగడ!



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: నీతి ఆయోగ్ పునర్వ్యవస్థీకరణను కూడా కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకుంటున్నట్టు కనిపిస్తున్నది! రెండో దశ అసెంబ్లీ ఎన్నికలు జరుపుకోనున్న పశ్చిమ బెంగాల్‌కు నీతి ఆయోగ్‌లో ప్రాధాన్యం లభించింది. పదవీకాలం పూర్తి కానున్న ఆ రాష్ట్ర బీజేపీ శాసనసభ్యుడు, ప్రముఖ ఆర్థికవేత్త అశోక్ కుమార్ లాహిరి నీతి ఆయోగ్ తదుపరి వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. బెంగాల్ కోణానికి మరింత బలాన్నిస్తూ ప్రముఖ ఇమ్యూనాలజిస్ట్, విద్యావేత్త గోవర్ధన్ దాస్ కూడా నీతి ఆయోగ్‌లో సభ్యుడిగా నియమితుల య్యారు. ఆర్థికవేత్త కేవీ రాజు, ఎయిమ్స్ డైరెక్టర్ ఎం శ్రీనివాస్, సెన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి అభయ్ కరండికర్, మాజీ క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబతోసహా ఐదుగురు పూర్తికాల సభ్యులను ప్రభుత్వం నియమించింది. వైస్ చైర్మన్‌గా నియమితులైన లాహిరి ప్రధాని నరేంద్ర మోదీని శనివారం కలిశారు. అనంతరం ప్రధాని మోదీ ఎక్స్ ద్వారా లాహిరికి శుభాకాంక్షలు తెలియచేశారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెక్ పెట్టి ప్రజాభిమాన్ని సంపాదించుకోవడానికి నీతి ఆయోగ్‌లో బెంగాల్ వ్యక్తులకు కేంద్రం పెద్ద పీట వేసినట్టు విమర్శకులు వ్యాఖ్యానించారు.

# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక కార్యదర్శిగా బి.ఎం. సంతోష నియమితులయ్యారు. జీహెచ్‌ఎంసీ గోల్కొండ జోనల్ కమిషనర్‌గా జి.ఉదయ్ కుమార్ బదిలీ అయ్యారు. ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శిగా అనుదీప్ దురిశెట్టి బాధ్యతలు తీసుకోనున్నారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా వికాస్ మహతో, రాజేంద్ర నగర్ జోనల్ కమిషనర్‌గా ఎస్. శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి కలెక్టర్‌గా ప్రతీక్ జైన్, నిర్మల్ కలెక్టర్‌గా భవేశ్ మిశ్రా, ఖమ్మం కలెక్టర్‌గా దివాకర, నారాయణ్‌పేట కలెక్టర్‌గా సిహెచ్ ప్రియాంక, ఉట్నూరు ఐటీడీఏ పీఓగా మకరందు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కమిషనర్‌గా దాన కిషోర్‌ను నియమించారు. నాగర్ కర్నూల్ కలెక్టర్‌గా హెచ్‌కే పాటిల్ బదిలీ అయ్యారు.

# సేవా ఇనామ్ భూమి వక్ఫ్ ఆస్తే దాన్ని అన్యాక్రాంతం చేయలేరు

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. వాటి బదిలీకి పరిమితులు నిస్సందేహంగా ఉంటాయని జస్టిస్ సుందరేష్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ప్రతివాదికి అనుకూలంగా సర్వీస్ ఇమామ్ భూమి అన్యాక్రాంతాన్ని రద్దు చేయాలన్న వక్ఫ్ ట్రిబ్యూనల్ నిర్ణయాన్ని తోసిపుచ్చిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. కర్నూలు జిల్లాలోని 3 ఎకరాల భూమికి సంబంధించినది ఈ కేసు. ఈ భూమి ఒక మసీదులో మతపరమైన సేవల కోసం మంజూరైన వక్ఫ్ ఆస్తి(సేవా ఇనామ్).





# హెచ్-1బీ వీసాలను మూడేండ్లు నిలిపివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మద్దతుగా మరో ఏడుమంది రిపబ్లికన్ నేతలు బిల్లును సమర్థించారు. హెచ్-1బీ ప్రోగ్రామ్‌లో సంస్కరణలు చేపట్టాలని బిల్లులో ప్రతిపాదించారు. ఈ వీసా పొందాలనుకొనేవారికి ఏడాదిలో కనీస వేతనం రెండు లక్షల డాలర్లు ఉండాలని డిమాండ్ చేశారు. అలాగే హెచ్-1బీ వీసాదారులు తమ కుటుంబ సభ్యులను అమెరికాకు తీసుకురావద్దన్న నియమాన్ని ప్రతిపాదిత బిల్లులో పొందుపర్చారు. లాటరీ సిస్టమ్‌కు బదులుగా వేతనం ఆధారంగా ఎంపిక జరగాలని, హెచ్-1బీ వర్కర్లు మల్టీపుల్ ఉద్యోగాలు చేసే అవకాశం ఇవ్వవద్దని బిల్లులో పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

(మొదటి పేజీ తరువాయి)



అధికారులు తెలిపారు.

**కేసు నేపథ్యమిదే..**

కేసీఆర్ హయాంలో రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీల ఫోన్లను ట్యాపింగ్ చేశారనే ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతోంది. ఇప్పటికే పలువురు పోలీసు ఉన్నతాధికారులు అరెస్ట్ కాగా, తాజాగా సాక్షుల విచారణలో భాగంగా శివకుమార్‌ను పిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్యాపింగ్ బాధితుల్లో శివకుమార్ పేరు ఉందా..? లేదా..? దీనికి సంబంధించిన ఇతర వివరాలు ఏమైనా ఆయనకు తెలుసా..? అనే కోణంలో అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను వేదికగా చేసుకుని జరుగుతున్న ఈ విచారణ, ఈ కేసును మరింత సమగ్ర సమాచారాన్ని ఛేదించే దిశగా ఈ విచారణ సాగనున్నట్లు తెలుస్తోంది. మే 28వ తేదీన శివకుమార్ ఇచ్చే స్టేట్‌మెంట్ ఈ కేసులో ఎవరి పాత్రను బయటపెడుతుందో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.a




# అమెరికా-ఇరాన్ మధ్య రెండోదఫా చర్చల్లేవ్

- పాకిస్థాన్‌కు వచ్చి వెళ్లిపోయిన అరాగ్చీ
- ఆ దేశ ప్రధాని, సైన్యాధ్యక్షుడితో సమావేశం
- అమెరికా ప్రతినిధుల పర్యటన రద్దు



ఇస్లామాబాద్/ వాషింగ్టన్, ఏప్రిల్ 25: అమెరికా-ఇరాన్ మధ్య రెండోదఫా చర్చలపై పీటముడి వీడటం లేదు. ఆదివారం చర్చలు ఉంటాయని అంతా భావిస్తున్న సమయంలో ఎటువారు అటే ఆగిపోయారు. శుక్రవారం రాత్రి పాకిస్థాన్‌కు వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్, సైన్యాధ్యక్షుడు అసిమ్ మునీర్‌ను కలిసి శనివారం తిరిగి వెళ్లిపోయారు. అబ్బాస్ పాక్ రావటంతో చర్చల కోసం తమ ప్రతినిధులు జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్‌కోఫ్‌ను కూడా పంపుతున్నట్లు ప్రకటించిన అమెరికా.. చివరి నిమిషంలో వారి పర్యటనను రద్దుచేసింది. దీంతో చర్చల ప్రయత్నాలకు విఘాతం కలిగింది. అంతకుముందు తాము అమెరికా ప్రతినిధులతో నేరుగా చర్చలు జరుపబోమని ఇరాన్ ప్రకటించింది. తమ అభిప్రాయాలను, ఆందోళన ను పాకిస్థాన్ ప్రతినిధులకు చేరవేస్తామని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఖయి శనివారం ట్వీట్ చేశారు. కానీ, ఇరాన్ నేతలతో నేరుగా చర్చలు జరిపేందుకు కుష్నర్, విట్‌కోఫ్‌లను పంపుతున్నట్లు ట్రంప్ రాయిటర్స్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. అబ్బాస్ మధ్యలోనే స్వదేశానికి వెళ్లిపోయిన తర్వాత ట్రంప్ ఫాక్స్ న్యూస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పాక్‌కు వెళ్లేందుకు మావాళ్లు సిద్ధమయ్యారు. అయితే, కొద్దిసేపటి క్రితమే వారికి అక్కడికి వెళ్లవద్దని చెప్పాను. ఏ ప్రయోజనమూ లేనిదానికి 18 గంటలపాటు ప్రయాణం చేసి వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పాను. మావద్ద అన్ని రకాల కార్డులు ఉన్నాయి. వాళ్లకు (ఇరాన్) ఇష్టమైనప్పుడే మాకు కాల్ చేయనివ్వండి' అని పేర్కొన్నారు. హోర్ముజ్‌లో వాణిజ్య నౌకల నుంచి ఇరాన్ టోల్ వసూలు చేస్తున్నట్లు ప్రకటించటంతో మలక్కా జలసంధి నుంచి వెళ్లే నౌకల నుంచి తాము కూడా టోల్ వసూలు చేస్తామని ఇండోనేషియా ఆర్థిక మంత్రి పర్బయా యుధి సదెవా శనివారం ప్రకటించారు. ఈ జలసంధి ఇండోనేషియా, మలేషియా, సింగపూర్ సరిహద్దుల్లో ఉంది. మరోవైపు, ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనాకు చెందిన దాదాపు 40 సంస్థలు, చమురు ట్యాంకర్లు, చమురు శుద్ధి కేంద్రాలపై కఠిన ఆంక్షలు విధించనున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. ముఖ్యంగా అత్యధికంగా ఇరాన్ ముడి చమురును కొనుగోలు చేస్తున్న హెంగ్లి పెట్రోకెమికల్ రిఫైనరీపై తొలిగా ఆంక్షలు విధించినట్లు చెప్పారు. కాగా, ఇరాన్ ప్రభుత్వం టెహ్రాన్ విమానాశ్రయం నుంచి శనివారం పౌర విమాన సర్వీసులను ప్రారంభించింది.



## శ్రీ శ్రీ శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

**చైర్మన్ బత్తిని మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో 216 అరటిపండ్ల నైవేద్య పూజ**

**స్వామి అంటే నేనున్నానంటూ మానవాళికి అండదండగా నిలిచే భక్తాంజనేయ స్వామికి వందనాలు అంటూ శరణు కోరిన హనుమాన్ భక్తులు**

చౌటుప్పల్ ఏప్రిల్ 25 వార్తా వేదిక సూర్య



యాదాద్రి భువనగిరి జిల్లా సుద్దాల గ్రామానికి చెందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ శ్రీ భక్తాంజనేయ స్వామి వారి ఆలయంలో దినదిన ప్రమాదమానంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి ఈ కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం భక్తాంజనేయ స్వామి మాలలు ధరించిన భక్తులు ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు వెంకటేశ్వర చార్యులు ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ సమక్షంలో 216 అరటి పండ్ల నైవేద్య పూజా కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుద్దాల గ్రామానికి చెందిన ప్రముఖులు మరియు హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బత్తిని మహేష్ గౌడ్, సుద్దాల గ్రామ సర్పంచ్ గడ్డమీది మహోదయ్ గౌడ్, ఉ ప సర్పంచ్ కాసశీ నాగేష్ గుప్త ,వార్డు నెంబర్లు యామగాని మైసయ్య గౌడ్ ,హనుమాన్ భక్తులు గూడ రవి గౌడ్, బత్తిని రాజు గౌడ్ ,మహేశ్వరశీ వెంకటేష్, గూడ పృధ్వి గౌడ్, తోటకూరి మహేష్ ,తుంగ నవీన్, మరాటి రాజు, తుంగ నవీన్, సురేష్, నరేష్ ,తదితర బాల భక్తులు పాల్గొన్నారు

## రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం పంపిణీ

చౌటుప్పల్ ఏప్రిల్ 25 వార్త వేదిక సూర్య





చౌటుప్పల మండలంలోని బంగారిగడ్డ, ఆరెగూడెం గ్రామాల్లో నలుగురు నిరుపేదలకు రూ.10,000/- చొప్పున అందజేత రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ మాధవరెడ్డి సహకారంతో శు క్రవారం చౌటుప్పల్ మండలంలోని నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు.జహంగీర్ ఖాన్ బంగారిగడ్డ, చౌటుప్పల్ -- రూ. 10,000/- హసీనా బేగం బంగారిగడ్డ -- రూ. 10,000/- పెండెం ఉమారాణి అర్రెడ్డిగూడెం -- రూ. 10,000/- ముద్దం నాగేష్ గౌడ్ అర్రెడ్డిగూడెం -- రూ. 10,000/- బంగారిగడ్డలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఎం.ఏ. ఖయ్యూం, నల్ల నర్సింహా, ఏసుదాస్, షాదీఖానా మాజీ చైర్మన్ హైజిజ్ పాషా, షాదీఖానా చైర్మన్ కరీం, వెంకటేష్ లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఆరెగూడెం గ్రామంలో గ్రామశాఖ అధ్యక్షులు బొమ్మగాని సాయిరాం గౌడ్, మాజీ సర్పంచ్ ముద్దం సుమిత్ర, సత్తయ్య గౌడ్, యెట్ట శంకరయ్య, సురివి వెంకటేశం, ముద్దం రాజేష్, నల్ల లక్ష్మయ్య, పెండెం బాలరాజు, అంతటి వెంకటేశం, బొల్లు దత్తు తదితరులు పాల్గొన్నారు. పేదలను ఆదుకోవడంలో ట్రస్టు చేస్తున్న సేవలను గ్రామస్తులు అభినందించారు.

# మహిళా రిజర్వేషన్-డి లిమిటేషన్ బిల్లు వంచనలు-వాస్తవాలు పై సెమినార్





**కల్లూరి మల్లేశం సిపిఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు**

చౌటుప్పల్ ఏప్రిల్ 25 వార్తా వేదిక సూర్య

కేంద్ర ప్రభుత్వం డి లిమిటేషన్ చేయడం వల్ల దక్షిణ భారతదేశం రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని సిపిఎం కార్యవర్గ సభ్యులు కల్లూరు మల్లేశం అన్నారు శనివారం చౌటుప్పల్ మున్సిపాలిటీలో రంగారెడ్డి స్మారక భవనంలో సెమినార్ నిర్వహించారు .ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మల్లేశం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మహిళల పట్ల మొదటి నుంచి చిత్తశుద్ధి లేదని మహిళా రిజర్వేషన్ బిల్లు ఆపడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వచ్చిన 12 సంవత్సరాల్లో రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను తీసుకురావడం, లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టి కార్మికులకు ఎనిమిది గంటల పని దినాన్ని పెంచి 12 గంటలు పని దినాన్ని చేయడం జరుగుతుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులైనటువంటి ఆదాని, అంబానీ, లాంటి వారి ప్రయోజనం కలిగించే చట్టాలను ప్రవేశపెట్టి దేశ ప్రజలను తాకట్టు పెడుతుందని అన్నారు. మీకు ఒకటిన్నర జరిగింది మే డే కార్యక్రమాలను కార్మికుల లోపం ఘనంగా నిర్వహించుకుని ,ఈ కోడ్ లకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ సభకు సిపిఎం పార్టీ మండలం కార్యదర్శి గంగాదేవి సైదులు, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, రాగిరి కిష్టయ్య, నాయకులు ఆదిమూలం నందీశ్వర్, బొడ్డు అంజిరెడ్డి, సప్పిడి శ్రీనివాసరెడ్డి, తూర్పునూరు మల్లేశం, బోయ యాదయ్య, మహేష్, నాయకులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ భృతిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం




**- గడ్డం వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**

యాదాద్రి భువనగిరి ఏప్రిల్ 25 వార్తా వేదిక సూర్య

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రతి నిరుద్యోగ యువకునికి 4016 రూపాయలు ప్రతి నెల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు నిరుద్యోగ భృతి పై స్పష్టత లేదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ అన్నారు. శనివారం అనాజ్ పురం గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి అనంతరం వారు మాట్లాడుతూ.

రంగారెడ్డి జిల్లా వేదికగా ప్రియాంక గాంధీ సమక్షంలో తెలంగాణ రాష్ట్రంలో యూత్ డిక్లరేషన్ ఐదు అంశాలతో ఏర్పాటు చేసి అధికారంలోకి రాగానే ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న యూత్ డిక్లరేషన్ లోని ఒక్క అంశాన్ని కూడా అమలు చేసిన పాపాన పోలేదని వారు అన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో అనేక మంది నిరుద్యోగ యువత ప్రభుత్వం నుండి ఉపాధి లభిస్తుందని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ఎదురుచూస్తున్న వారి ఆశలు అడియాశలు అవుతున్నాయి తప్ప ప్రభుత్వం నుండి ఏ మాత్రం కూడా స్పందనలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే టీఎస్పీఎస్సీ ద్వారా వేల మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్న ప్రభుత్వం దానిపై కనీసం ఎలాంటి ప్రకటనలు లేకుండా నిరుద్యోగులను మోసం చేస్తుందని మేము అధికారంలోకి వస్తే ప్రతి నిరుద్యోగికి 4016 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి రాష్ట్రంలో నిరుద్యోగ యువతను మోసం చేసిందని వారు అన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాల మాటను మరిచిపోయింది అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా 2 లక్షల ఉద్యోగాల మాటను ఊసే లేకుండా చేసిందని కేవలం 67,763 ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందని వారన్నారు. గ్రామాలలో ఉపాధి లేక అనేక మంది యువత చెడుదారులు పడుతున్నారని వారు గుర్తు చేశారు. జిల్లావ్యాప్తంగా అనేక పరిశ్రమలు ఉన్న స్థానిక పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి గుమాస్తాలుగా పనిచేస్తున్న పరిస్థితి ఉందని వారు అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి పై స్పష్టత ఇచ్చి ప్రతి నిరుద్యోగి నిరుద్యోగ భృతిని ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. వీరితో పాటు డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు మైలారం శివ జిల్లా నాయకులు బొల్లెపల్లి శ్రీకాంత్ ప్రవీణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఓయూలో 28న మహనీయుల జయంతోత్సవాలు



**ఆర్ట్స్ కాలేజీ వేదికగా పూలే - అంబేడ్కర్ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ**

**బహుజన ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం: ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావు**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య ):

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 28వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. శనివారం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావు మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు మరియు ఆదివాసీలు ఐక్యంగా ఉన్నప్పుడే రాజ్యాధికారం సిద్ధిస్తుందని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దళిత బహుజనులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ఉమ్మడి పోరాటాలు అవసరమని ఆయన పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని డాక్టర్ అవ్వారు వేణు కుమార్ డిమాండ్ చేశారు. బహుజన రాజ్యాధికారం కోసం అన్ని వర్గాలు కలిసి పనిచేయాలని డీబీఎస్ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ జంగిలి దర్శన్ పేర్కొన్నారు. నాగనమోని చెన్నరాములు ముదిరాజ్ అధ్యక్షతన మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమయ్యే ఈ సభకు ముఖ్య అతిథులుగా మాజీ ఐఏఎస్ టీ. చిరంజీవులు, ప్రధాన వక్తగా ప్రముఖ మేధావి ప్రొఫెసర్ కంచ ఐలయ్య, విశిష్ట అతిథులుగా మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, మాజీ డీజీపీ డాక్టర్ జె. పూర్ణ చంద్రరావు హాజరుకానున్నారు. బీసీఎఫ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం, డీబీఎస్ఏ, పీడీఎస్‌యూ, బీసీ జేఏసీ తదితర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రామ్ షెఫర్డ్, ప్రొఫెసర్ రాములు, డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్, కొంకటి లక్ష్మణ్, ఆర్.ఎల్. మూర్తి సహా పలువురు విద్యార్థి నేతలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. బహుజన బిడ్డలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.



## గీతా పఠనంలో ఆదర్శంగా నిలుస్తున్న మహిళలు

**పురాణాపుల్ ఆర్యవైశ్య సంఘంలో 51 వారాల ఆధ్యాత్మిక ప్రయాణం**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య )



నేటి ఆధునిక కాలంలో ఆధ్యాత్మికతను, క్రమశిక్షణను జోడించి మహిళలు సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. కార్వాన్ పురాణాపుల్ ఆర్యవైశ్య సంఘం వేదికగా గత ఏడాది కాలంగా సాగుతున్న భగవద్గీత పఠనం కార్యక్రమం విజయవంతంగా 51వ వారం పూర్తి చేసుకుంది. మహిళల ఆధ్వర్యంలో అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం స్థానికంగా చర్చనీయాంశమైంది. కేవలం పఠనానికే పరిమితం కాకుండా, గీతలోని పరమార్థాన్ని అర్థం చేసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. ఇప్పటికే రెండుసార్లు భగవద్గీతను సంపూర్ణంగా పూర్తి చేసిన మహిళలు, ప్రస్తుతం మూడవసారి పారాయణాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం మూడవ అధ్యాయాన్ని తాత్పర్య సహితంగా అధ్యయనం చేస్తూ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు. ఈ కార్యక్రమం ప్రత్యేకత ఏమిటంటే, పాల్గొనే మహిళలందరూ తప్పనిసరిగా 'డ్రెస్ కోడ్' పాటిస్తూ సంప్రదాయబద్ధంగా హాజరవుతున్నారు. శ్లోకాలను పలకడంతో పాటు వాటి అంతరార్థాన్ని సులభశైలిలో బోధిస్తుండటంతో భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పఠనం అనంతరం మహిళలు ఉత్సాహంగా సంప్రదాయ 'కొలతలు' ఆడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు.

ఈ సందర్భంగా మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ.. "భగవద్గీత మన నిత్య జీవితంలోని సమస్యలకు పరిష్కారం చూపుతుందని, ప్రతి ఇంట్లో గీతా పఠనం జరగాలని" కోరారు. సమాజంలో మంచి విలువలను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని వారు తెలిపారు. సంఘంలో ఆధ్యాత్మిక శోభను నింపడమే కాకుండా, రాబోయే తరాలకు ఒక గొప్ప బాటను వేస్తున్న ఈ మహిళల కృషి అనన్యం. కార్వాన్ పురాణాపుల్ ఆర్యవైశ్య సంఘం నేడు ఒక ఆధ్యాత్మిక పాఠశాలగా మారి, అందరికీ మార్గదర్శకంగా నిలుస్తోంది.

## మలేరియా రహిత సమాజమే లక్ష్యం: జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ మధన్

**- నర్సింగ్‌లో ప్రపంచ మలేరియా దినోత్సవ వేడుకలు**

**- 50 మంది టీబీ రోగులకు పోషకాహార కిట్ల పంపిణీ**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య )



ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సింగ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ మధన్ ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారానే మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులను తరిమికొట్టగలమని పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. అవగాహన కార్యక్రమంతో పాటుగా, క్షయ వ్యాధిగ్రస్తులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో డాక్టర్ మధన్ తన ఉదారతను చాటుకున్నారు. తన స్వంత నిధులతో 50 మంది టీబీ రోగులకు అవసరమైన పోషకాహార కిట్లను ఆయన పంపిణీ చేశారు. వ్యాధి త్వరగా నయం కావడానికి మందులతో పాటు పోషకాహారం తీసుకోవడం ఎంతో అవసరమని ఆయన వివరించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజలకు ఆరోగ్య అంశాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాకేష్, డాక్టర్ వినోద్, ఆరోగ్య పర్యవేక్షకులు, సహాయక నర్సులు, ఆశా కార్యకర్తలు మరియు ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు అందని విద్యా హక్కు!

**- ప్రైవేట్ పాఠశాలల తీరుపై 'ది సిటిజెన్స్ కౌన్సిల్' అసహనం**

**- గీతాంజలి విద్యా వేదికలో అందని ఉచిత ప్రవేశాలు**

**- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**



మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య ) :

రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం (ఆర్ టీ ఈ -2009) అమలు తీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. సామాజిక-రాజకీయ సంస్థ 'ది సిటిజెన్స్ కౌన్సిల్' ప్రతినిధులు శనివారం నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో పలు విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. అందరికీ నాణ్యమైన, సరసమైన విద్యను అందించడమే లక్ష్యంగా కౌన్సిల్ బృందం పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించింది. కౌన్సిల్ ప్రతినిధులు సీతారం ధూళిపాళ, అందె లక్ష్మణ్ రావు, ఉపేంద్రనాథ్ రెడ్డి తదితరుల బృందం గీతాంజలి విద్యా వేదిక మరియు శ్లోక పాఠశాలలను పరిశీలించారు. గీతాంజలి విద్యా వేదికలో ఇప్పటివరకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈ డబ్ల్యూ ఎస్ ) చెందిన ఏ ఒక్క విద్యార్థికీ ప్రవేశం కల్పించలేదని బృందం గుర్తించింది. దీనికి తోడు ప్రతి ఏటా ఫీజులను సుమారు 10 శాతం పెంచుతూ తల్లిదండ్రులపై పెను భారం మోపుతున్నారని ప్రతినిధులు మండిపడ్డారు. దీనిపై యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే హెడ్ ఆఫీస్‌కు మెయిల్ చేయాలని ఉచిత సలహా ఇస్తున్నారని, తీరా మెయిల్ చేసినా స్పందన ఉండటం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు శ్లోక పాఠశాల తీరును బృందం సభ్యులు అభినందించారు. ఇక్కడ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులను పరిగణలోకి తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు నైతిక విలువలను బోధించడంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ది సిటిజెన్స్ కౌన్సిల్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, బలహీన వర్గాల పిల్లలకు చట్టప్రకారం దక్కాల్సిన న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ ఆరిఫ్ మొహమ్మద్, సుమ నళిని, బొడ్డు శ్రీధర్, దేవీప్రియ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా అన్నపురెడ్డి స్వర్ణలత

**- కిస్మత్‌పూర్ వాసికి రాష్ట్ర కమిటీలో అరుదైన గుర్తింపు**

**- నియామకంపై పార్టీ శ్రేణుల హర్షం**



మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్‌పూర్ ప్రాంతానికి చెందిన అన్నపురెడ్డి స్వర్ణలత బీమార్జున్ రెడ్డికి భారతీయ జనతా పార్టీలో కీలక పదవి దక్కింది. ఆమెను బీజేపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ప్రకటించిన రాష్ట్ర మహిళా కమిటీలో స్వర్ణలతకు ఈ బాధ్యతలు అప్పగించారు. రంగారెడ్డి జిల్లా రూరల్ ప్రాంతానికి చెందిన స్వర్ణలత గత కొంతకాలంగా ప్రజా ప్రతినిధిగా, సామాజిక కార్యకర్తగా నియోజకవర్గంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. బీజేపీ మహిళా విభాగంలో పార్టీ బలోపేతానికి ఆమె చేసిన కృషిని గుర్తించిన అధిష్టానం, అంచలంచెలుగా ఎదుగుతున్న ఆమెకు ఈసారి రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యత కల్పించింది.

తన నియామకం పట్ల స్వర్ణలత సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రా రావు, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ మరియు ఇతర రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాల సాధనకు, మహిళా సాధికారతకు తన శాయశక్తులా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. స్వర్ణలత నియామకం పట్ల రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఎంజీఐటీలో ఏఐ టెక్నాలజీపై అవగాహన సదస్సు

**గెస్ట్ లెక్చరర్‌గా సందీప్ పామిడిపార్థి**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య ) :

మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో శుక్రవారం 'ది రైజ్ ఆఫ్ జెయింట్స్ అండ్ ద మినియన్స్' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంటెల్లాట్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు మరియు సీటీవో సందీప్ పామిడిపార్థి హాజరై ప్రసంగించారు. మెషిన్ లెర్నింగ్ ప్రారంభ దశల నుండి నేటి ఆధునిక ఎల్‌ఎల్‌ఎంలు , ఏజెంట్ టెక్నాలజీల వరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులను ఆయన విద్యార్థులకు వివరించారు. ప్రస్తుత ఐటీ పరిశ్రమలో ఏఐ వినియోగం మరియు మారుతున్న టెక్నాలజీ ట్రెండ్స్ గురించి విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. అనంతరం మధ్యాహ్నం ప్రవర్తక్ ఏఐ క్లబ్ ఆధ్వర్యంలో 'యూఐ క్లోన్ వార్స్ ' అనే వినూత్న పోటీని నిర్వహించారు. విద్యార్థుల సృజనాత్మకతకు పరీక్షగా నిలిచిన ఈ పోటీలో, ఇచ్చిన డిజైన్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం మరియు నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు సిద్ధాంతపరమైన అంశాలతో పాటు ఆచరణాత్మక జ్ఞానాన్ని అందించడంలో ఎంతగానో దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.

# జై గౌడ్ ఉద్యమ నాయకులు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ కి ఆహ్వాన పత్రిక..

గుండాల వార్తవేదిక సూర్య ఏప్రిల్ 25



సుద్దాల గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ దంతూరి మల్లయ్య గౌడ్ గారి పెద్ద కుమారుని వివాహ వేడుక సందర్భంగా, జై గౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ గారికి తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఈ కార్యక్రమం మార్చి 29న నిర్వహించబడనున్న పెళ్లి వేడుకకు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు పెద్దఎత్తున హాజరై ఆశీర్వదించాలని కోరుతూ, జై గౌడ్ ఉద్యమ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ దంతురి శ్రీనివాస్ గౌడ్ ఉద్యమ నాయకులు ఆహ్వానం అందించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సమాజ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న జాతీయ అధ్యక్షుడు ఈ శుభకార్యానికి విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించలని కోరారు.

# ఆర్టీసీ కార్మికులకు అండగా బిఆర్ఎస్





**రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

**- మృతి చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ కు ఘన నివాళి**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య ) :

ఆర్టీసీ కార్మికులు చేపట్టిన రాష్ట్ర బందుకు మద్దతుగా కార్వాన్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టాయి.

పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, నియోజకవర్గ ఇన్చార్జ్ జీవన్ సింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ డివిజన్ల నాయకులు, కార్యకర్తలు ఏకమై తమ సంఘీభావాన్ని ప్రకటించారు. గుడిమల్కాపూర్ లోని శివ భాగ్ నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ మెహదీపట్నం బస్ డిపో వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మెహదీపట్నం డిపో వద్ద కార్మికులను కలిసి వారి పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఇటీవల మృతి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన మృతికి సంతాపం తెలిపారు.

ఈ సందర్భంగా జీవన్ సింగ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగానైతే పోరాడి సాధించుకున్నామో, అదే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కులను సాధించుకోవాలి. ఎవరూ ఆత్మస్థైర్యం కోల్పోవద్దు, ఆత్మహత్యలకు పాల్పడవద్దు. బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ మీకు అండగా ఉంటుంది. అని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్, రాములు, ఆదిత్య యాదవ్, సత్యనారాయణ గౌడ్, నరేష్, రంగారెడ్డి, జ్యోతి రాజ్, వెంకటరమణ, తుమ్మ నవీన్, అక్షయ్, హరీష్, కులుకుంట్ల దిలీప్ కుమార్ సింగ్, సంజీవ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.





# మహిళా సాధికారతకు 'రుణ' భరోసా

**- అత్తాపూర్ సర్కిల్‌లో 37 లక్షల చెక్కుల పంపిణీ**

**- ఆరు స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక చేయూత**

**- 'అమ్మ 99 డేస్ ప్రజా పాలన'లో భాగంగా కార్యక్రమం**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య ) :

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సమాజం పురోగమిస్తుందని అత్తాపూర్ సర్కిల్ డీసీ మల్లయ్య అన్నారు. 'అమ్మ 99 డేస్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శనివారం అత్తాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరు స్వయం సహాయక సంఘాలకు సంబంధించి మొత్తం □37 లక్షల రుణాలను మంజూరు చేసి, ఆయా సంఘాల ప్రతినిధులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా డీసీ మల్లయ్య మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. మంజూరైన రుణాలను సద్వినియోగం చేసుకొని, స్వయం ఉపాధి రంగాల్లో మహిళలు రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పథకం ద్వారా అట్టడుగు వర్గాల మహిళలకు సైతం ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో కరుణాకర్ పాల్గొని మాట్లాడుతూ.. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సి.ఓలు, వివిధ మహిళా సంఘాల సభ్యులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తమకు ఆర్థిక సహాయం అందించినందుకు మహిళా సంఘాల సభ్యులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా సాధికారతే లక్ష్యంగా 'ప్రజా పాలన'

**పీ అండ్ టీ కాలనీలో బ్యాంక్ లింకేజ్ చెక్కుల పంపిణీ**

**భారీ స్థాయిలో ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమం**

**ఇంటింటికీ వెళ్లి మహిళా సంఘాలపై అవగాహన కల్పించిన ఆర్పీలు**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య ) :





ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా పీ అండ్ టీ కాలనీలో శనివారం బహుళార్థక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల ఆర్థికాభివృద్ధి, ఓటర్ల చైతన్యం మరియు పారిశుధ్యం లక్ష్యంగా సాగిన ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిం చింది. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి ) సభ్యులకు బ్యాంక్ లింకేజ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని, ప్రభుత్వం అందిస్తున్న ఈ రుణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాలనీలో సార్ ఓటర్స్ మ్యాపింగ్ కార్యక్ర మాన్ని అధికారులు భారీ స్థాయిలో నిర్వహించారు. స్థానిక నివాసితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటర్ల జాబితాలో తమ వివరాలను మ్యాపింగ్ చేసుకు న్నారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన ఈ ప్రక్రియ విజయవంతమైంది. మహిళా సంఘాల బలోపేతం కోసం ఆర్పీలు కాలనీలో ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. గ్రూపుల్లో సభ్యులుగా లేని మహిళలను గుర్తించి, వారిని సంఘాల్లో చేరాలని ప్రోత్సహించారు. ఎస్ హెచ్ జీ గ్రూపుల ద్వారా పొందే ప్రభుత్వ పథకాలు, రాయి తీలు మరియు ఇతర ప్రయోజనాలపై మహిళలకు వివరించారు. కాలనీ పరిసరాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించి, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ స్వాతి, ఎంటమాలజీ మరియు శానిటేషన్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కార్మికుల హక్కులను రక్షించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడటం ఎంతో బాధాకరం

## ఆ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తాం

## ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 25 (వార్తా వేదిక సూర్య )

కార్మికుల సమస్యలను పరిష్కరించడం, వారి కుటుంబాలకు భరోసా కల్పించడం, వారి హక్కులను రక్షించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు.

హైదరాబాద్ సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ముగిసిన ఆర్టీసీ సమ్మె పై మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. కార్మికుల సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలను సమగ్రంగా తెలుసుకుని పరిష్కార మార్గాలను అన్వేషించామని, కార్మికుల పక్షాన ప్రభుత్వం అండగా నిలిచామని పేర్కొన్నారు. సమ్మె సమయంలో ఒక ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడటం ఎంతో బాధాకరమని అన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే గంటి మాధవరెడ్డి కూడా ఆ కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు గత ప్రభుత్వ హయాం లో పేరుకుపోయినవేనని, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్మికుల సంక్షేమం కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రిమోల్ సర్వీసుల్లో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్న సుమారు 300 మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే, ఆర్థిక వ్యవస్థను సమతుల్యం చేస్తూ కార్మికుల హక్కులను కాపాడుతున్నామని స్పష్టం చేశారు.

# వాడవాడల మేడే ఘనంగా నిర్వహించండి : సీపీఎం

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 25 (వార్తా వేదిక సూర్య )



ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా వాడవాడలో అరుణ పతాకాలు ఎగురవేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాశం పిలుపునిచ్చారు. శనివారం సిపిఎం నల్గొండ పట్టణ కమిటీ సమావేశం సుందరయ్య భవన్ లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన హాశం మాట్లాడుతూ.. చికాగో నగరంలో హే మార్కెట్లో 8 గంటల పని విధానం కోసం జరిగిన పోరాటం లో అమరుల రక్తతరపనం తో ఏర్పడిన ఎర్రజెండా నాటి నుండి నేటి వరకు ఆ స్ఫూర్తి తో అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించడం జరిగిందని అన్నారు. నాటి పోరాటాల ఫలితాలను నేడు బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా మారుస్తూ కార్మికులను బానిసలుగా చేయడానికి కుట్రలు చేస్తుందని ఆరోపించారు. మే డే స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు మే డే సందర్భంగా జరిగే ర్యాలీలలో, సభలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. పెన్షన్లు పెంచాలని వందల మంది దరఖాస్తులు పెట్టి భర్తలు చనిపోయిన వారు.వికలాంగులు మారిన వారు అనేకమంది కొత్త పెన్షన్లకు ఎదురుచూస్తున్నారని వారికి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో నిర్మించిన 552 డబల్ బెడ్ రూమ్ లో లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చి స్వాధీన పరచాలని డిమాండ్ చేశారు. ప్రకాశం బజార్ ఎగ్బాల్ మిలాన్ కా నుండి మైసయ్య విగ్రహం వరకు ఫుట్పాతుల మీద జీవనోపాధి పొందుతున్న వారిని తొలగించిన నగరపాలక సంస్థ వారికి శాశ్వతం ప్రాతిపదికన దుకాణ సముదాయాలు నిర్మించి ఉపాధిని కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, అవుట రవీందర్, దండెంపల్లి సరోజ , అద్దంకి నరసింహ, సలివొజి సైదాచారి, కన్నెకంటి సత్య నారాయణ, సర్దార్ అలీ, శాఖ కార్యదర్శులు సీతా వెంకటయ్య, రాజేష్ పాల్గొన్నారు.

# అధర్మంపై ధర్మం గెలిచింది.. కుట్రల కోటలు బద్దలయ్యాయి!

## నిజం నిప్పులాంటిది.. హైకోర్టు తీర్పుతో తేలిపోయిన కాంగ్రెస్ అబద్ధాలు!

## బిఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజం.. ఇది తెలంగాణ ప్రజల విజయం!

## ప్రాజెక్టుపై కాంగ్రెస్ నిందలు నీళ్లపాలు: ఎస్. వెంకటేష్, గుమ్మడి కుమార్



మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య ) :

చీకటి ఎంత గాఢంగా ఉన్నా సూర్యోదయాన్ని ఆపలేదు.. అబద్ధం ఎంత వేగంగా ప్రచారం చేసినా నిజాన్ని ఓడించలేదు! కాళేశ్వరం ప్రాజెక్టుపై గత కొంతకాలంగా సాగుతున్న దుష్ప్రచారానికి హైకోర్టు తీర్పుతో తెరపడింది. ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ మరియు మైలర్ దేవ్ పల్లి అధ్యక్షులు గుమ్మడి కుమార్ అగ్నిపర్వతంలా గర్జించారు. మేము ముందే చెప్పాం.. ఇది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని! ఇవాళ అదే నిజమైంది. తెలంగాణ గడ్డపై వెలసిన ఆధునిక దేవాలయం కాళేశ్వరాన్ని కూల్చాలని చూసిన శక్తులకు కాలమే సమాధానం చెప్పింది. లక్ష కోట్ల అవినీతి అంటూ గాలి కబుర్లు చెప్పిన వారికి ఈ తీర్పు ఒక చెంపపెట్టు." అని నేతలు కార్యకర్తలను ఉద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. వరదలు వచ్చినా, విమర్శలు ముంచెత్తినా మేడిగడ్డ గర్వంగా నిలబడే ఉంది.

ప్రాజెక్టు పనికిరాదు అన్న నోళ్లే, ఇప్పుడు పునరుద్ధరణ పనులు ప్రారంభించి తమ ఓటమిని అంగీకరించాయి.

కేసీఆర్ జల సంకల్పం ముందు జల ద్రోహుల కుతంత్రాలు పటాపంచలయ్యాయి. ఈ విజయం కేవలం న్యాయస్థానంలో వచ్చింది మాత్రమే కాదు, ఇది ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త నైతిక విజయం. అబద్ధాలను నమ్మే రోజులు పోయాయని, నిజం ఎప్పుడూ మన పక్షమే ఉంటుందని నేతలు స్పష్టం చేశారు. "మనం కట్టిన ప్రాజెక్టులు.. మనం తెచ్చిన నీళ్లు.. మన నాయకుడి దార్శనికత" అజేయమని వారు చాటి చెప్పారు. ఈ మహా గెలుపు ఉత్సాహంలో రాజేష్ యాదవ్, గంజి రాజు, మాచర్ల చిరంజీవి, ప్రవీణ్, అశోక్ కుమార్, ఏర్వ మహేష్, గురు స్వామి తదితరులు పాల్గొని, "జై తెలంగాణ.. జై జై కేసీఆర్" నినాదాలతో హోరెత్తించారు.

# తెలంగాణ రాష్ట్ర సేన పార్టీలో బతుకమ్మ పార్టీ విలీనం





- కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీని విలీనం చేసిన బతుకమ్మ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి
- భవిష్యత్తులో కల్వకుంట్ల కవితను సీఎం చేయడమే లక్ష్యం - మణిపాల్ రెడ్డి

వార్త వేధిక సూర్య / యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :-

రాష్ట్రంలో సంచనాల దిశగా ఏర్పడిన కొత్త పార్టీ తెలంగాణ రాష్ట్ర సేన లో బతుకమ్మ పార్టీ ని విలీనం చేస్తున్నట్టు బతుకమ్మ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి తెలిపారు. రెండు సార్లు ఆలేరు కాంటెస్ట్ ఎమ్మెల్యే గా ఒకసారి భువనగిరి కాంటెస్ట్ ఎంపీ గా పోటీ చేసి ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని బతుకమ్మ పార్టీనీ నిర్మించారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో అన్నీ వర్గాలను కలుపుకొని తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను సీఎం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరం కష్టపడుదామని ఆయన తెలిపారు. గతంలో ఎన్ని ఆటంకులు వచ్చినా తమ లక్ష్యాన్ని టార్గెట్ గా చేసుకొని ప్రతి ఒక్కరిని కలుపుకొని తెలంగాణ జాగృతి పేరుతో వాడ వాడ బతుకమ్మ పండుగను గుర్తుచేస్తూ వాడల నుంచి దేశం గర్వించేలా బతుకమ్మ పండుగను దేశవ్యాప్తంగా మరియు ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసిన కల్వకుంట్ల కవిత నాయకత్వంలో అందరం పనిచేస్తూ భవిష్యత్తులో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేసిన కడిగిన ఆణిముత్యం లాగా కవితక్క పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. సుమారు 1000 మందితో ఆలేరు నుండి తన కార్యాలయం వద్ద సుమారు 20 బస్సులలో వెయ్యి మందిని తమ సొంత పార్టీ కార్యకర్తలను కవితమ్మ ఏర్పాటు చేసే పార్టీ సభ వేదికకు తరలించామని ఆయన తెలిపారు.



# మేయర్ కు 32 వ డివిజన్ ప్రజల ఘన సన్మానం

నల్లగొండ టౌన్ ఏప్రిల్ 25. ( వార్త వేదిక సూర్య)

పట్టణంలోని 32వ డివిజన్ నుండి కార్పొరేటర్ గా అత్యధిక మెజార్టీతో గెలిచిన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా ఎన్నిక కావడంతో హర్షం వ్యక్తం చేస్తూ మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డిని 32 వ డివిజన్

యెలిశాల కాలనీ వాసులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించి, ఆంజనేయ స్వామి విగ్రహ జ్ఞాపికను బహుకరించారుఈ సందర్భంగా తమ డివిజన్ నుండి కార్పొరేటర్ గా ఎన్నికై నగర తొలి మేయర్ గా బాధ్యతలు స్వీకరించడం అందరికీ ఎంతోగర్వకారణంగా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. దిన దినాభివృద్ధి చెందుతున్న నల్లగొండ నగరం బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో మరింత అభివృద్ధి పదంలో ముందుకు సాగుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో రాష్ట్రంలోనే నెంబర్ వన్ కార్పొరేషన్ గా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తమ కాలనీ తరఫున నిరంతరం బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డికి అన్ని రకాలుగా వెన్నుదన్నుగా నిలుస్తామని చెప్పారు. తమ కాలనీలో ఎలాంటి సమస్యలు లేకుండా గత నాలుగు పర్యాయాలుగా విజయం సాధించడంతోపాటు తమ అందరికీ నిరంతరం అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా సహకారం అందిస్తున్న బుర్రి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కొండకింది సత్తిరెడ్డి, కోటగిరి దైవాదినం, బచ్చు మురళి, కాపర్తి లక్ష్మీ నరసయ్య, తల్లం వెంకటేశం శివకోటి నెహ్రూ, రంగా విద్యాసాగర్, లింగాల సోమయ్య, వెంకన్న, మోదుగు పాండు, కోటగిరి రామకృష్ణ శ్రీధర్, చెర్రీ, వాసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగాల అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కట్టంగూర్ మండల వ్యాప్తంగా ఐకేపీ కేంద్రాల్లో దాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలి



## అకాల వర్షాలు వస్తే ధాన్యం మొత్తం తడిసి రైతులు నష్టపోయే ప్రమాదం

## ఎండలకు ఇబ్బందులు పడుతున్నాం.. కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్న రైతులు


## అఖిల భారత రైతు -కూలీ సంఘం (ఏ.ఐ.కే.యం.ఎస్ )

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 24 (వార్తా వేదిక సూర్య )

మునుకుంట్ల ఐకేపీ సెంటర్లో రోజుల తరబడి ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడాన్ని నిరసిస్తూ, ఐకేపీ సెంటర్ వద్ద ఏ.ఐ.కే.యం.ఎస్ ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలపారు. ఈ సందర్భంగా ఏ.ఐ.కే.యం.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గజ్జి రవి, పి.వై.యల్ జిల్లా నాయకులు గంగనబోయిన వీరాంజనేయులు లు మాట్లాడుతూ..ఈ నెల 8 న మునుకుంట్ల గ్రామంలో ఐకేపీ సెంటర్ ను ప్రారంభించారని, అధికారులు, మిలర్ల నిర్లక్ష్యం తో వారానికి ఒక లారీ ధాన్యం ను కూడా ఎత్తడం లేదని విమర్శించారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం మొత్తం తడిసి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. కట్టంగూర్ మండల వ్యాప్తంగా ఐకేపీ కేంద్రాల్లో దాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఎండలకు ఇబ్బందులు పడుతున్నారని, కనీసం సౌకర్యాలు కల్పించాలని డిమాడ్ చేశారు. మునుకుంట్ల ఐకేపీ సెంటర్ నిర్వాహకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సోమవారం తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.కే.ఎం.ఎస్ జిల్లా నాయకులు బూరుగు సత్తయ్య, నాయకులు, రైతులు నిమ్మనగోటి రాములు, చిలుముల సాయిలు, గంట రాములు, వల్లపు వెంకన్న, గద్దగూటి సత్తయ్య, పిచ్చమ్మ, సైదమ్మ, మల్లేశ్వరి, నాగమ్మ,సైదులు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారుడు జాగటి రాములుకు నివాళులర్పించిన 3 వ డివిజన్ కార్పొరేటర్ పేర్ల మల్లేశ్వరి- అశోక్ చంద్ర


నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 25 (వార్తా వేదిక సూర్య )



నలగొండ 3 డివిజన్ పరిధిలోని శేషమ్మ గూడెం లో జానపద కళాకారుడు జాగటి రాములు మరణించగా 3 వ డివిజన్ కార్పొరేటర్ పేర్ల మల్లేశ్వరి- అశోక్ చంద్ర లు అతని కుటుంబాన్ని పరామర్శించి, అతని మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించి. మృతుని కుటుంబానికి 5000/- రూ. ఆర్థిక సాయం అందజేసారు. ఈ కార్యక్రమంలో కవి గాయక జానపద కళాకారుడు గుండ్లపల్లి ఆదినారాయణ, జాగటి బిక్షం,బొల్లేద్దు శివ ప్రసాద్, జాగటి సత్తయ్య,జాగటి వెంకన,బొల్లెద్దు జానయ్య,పేర్ల చంద్రకాంత్, పేర్ల రాజు, పేర్ల తేజ, మధురవాణి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి





## పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

### కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

### ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి

నాంపల్లి ఏప్రిల్25(వార్త వేదిక సూర్య)

నల్గొండ జిల్లా నాంపల్లి మండలం గ్రామపంచాయతీ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్ వేతనాలు ఇవ్వాలి అని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు నాంపల్లి మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీస్ ముందు గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు అనంతరం మండల పంచాయతీ అధికారి సిహెచ్ మధు గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల తరువాత గ్రామపంచాయతీ కార్మికులపై అధికారులు మరియు నూతన సర్పంచులు వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు వారి చర్యలు మార్చుకోవాలని పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని అన్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కనీస వేతనం 26000 నిర్ణయించాలని పిఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కార్మికులకు వేతనాలకు సపెరేట్ గ్రాంట్ ఏర్పాటు చేయాలని దాని ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు

కేంద్రం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు ధర్నా అనంతరం మండల పంచాయతీ అధికారి సిహెచ్ మధు గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఏదుళ్ళ సునీత, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ ఒ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)మండల అధ్యక్షులు అబ్బనబోయిన వెంకటయ్య వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొమ్ము లక్ష్మయ్య,బచ్చనబోయిన లక్ష్మయ్య, ఒటికోటి గిరి గాదపాక మరియమ్మ, ఈరమ్మ, పార్వతమ్మ,సులోచన నాగమ్మ,తదితరులు పాల్గొన్నారు



# దేశవ్యాప్తంగా జనగణన ప్రారంభం..

## స్వీయ నమోదు సదుపాయాన్ని వినియోగించుకోండి

### మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 25 (వార్తా వేదిక సూర్య )

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా చేపడుతున్న జనగణన కార్యక్రమం లో భాగంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. ఈ జనగణన కార్యక్రమం దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించనున్నందున ప్రజలందరూ సహకరించాలని కోరారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 342 ఎన్యూమరేషన్ బ్లాకులు ఏర్పాటు చేశామన్నారు, ప్రతి 800 మంది జనాభాకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించామని తెలిపారు. ఈ మేరకు మొత్తం 377 మంది ఎన్యూమరేటర్లు, 63 మంది సూపర్వైజర్లు నియమించబడ్డారని ఆయన అన్నారు. ఈసారి కేంద్ర ప్రభుత్వం సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రజలు తమ ఇళ్లలో నుంచే ఆన్లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది. ఈ సదుపాయం ఏప్రిల్ 26 నుండి మే 10, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. సంబంధిత వెబ్‌సైట్ (శిష్ట్రజూం://ఒవ.ఎవఅంబం.స్త్రశీజ.ఱఅరి(ష్ట్రజూం://ఒవ.ఎవఅంబం.స్త్రశీజ.ఱఅ)) ద్వారా ప్రజలు తమ వివరాలను సులభంగా నమోదు చేసుకోవచ్చు అని తెలిపారు. ప్రజలందరూ స్వీయ నమోదు సదుపాయాన్ని వినియోగించుకుని, జనగణన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

# సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 25 (వార్తా వేదిక సూర్య )





ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న మల్టిపుల్ ఈవెంట్స్ లో పాల్గొని విద్యార్థులు రాణించాలని రాష్ట్ర మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యా సంస్థల సెక్రటరీ బి. సైదులు అన్నారు. శనివారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలో ఉన్న కనగల్ మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల విద్యాలయలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల బీసీ గురుకుల పాఠశాలలు, హాస్టల్ల విద్యార్థులకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందులో భాగంగా విద్యతో పాటు, వివిధ రకాల వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు విద్యార్థులకు సమ్మర్ కోచింగ్ ద్వారా వివిధ రకాల కార్యక్రమాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు కేవలం ఒకటి,రెండు అంశాల పై మాత్రమే విద్యార్థులు పాల్గొనే వారని, కానీ ప్రభుత్వ ఆదేశాల మేరకు మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో అన్ని రకాల ఈవెంట్స్ లో సమ్మర్ కోచింగ్ శిక్షణ ఇస్తున్నట్టు ఆయన వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు ,ఏదైనా ఒక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని, అది భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆ నైపుణ్యం ద్వారా ఉద్యోగాలు సైతం పొందవచ్చని అన్నారు .అందువల్ల విద్యార్థులు విద్యను అభ్యసిస్తూనే ఏదైనా అంశంలో స్వీయ శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. కాగా ఈనెల 24 నుండి మే 8 వరకు నిర్వహిస్తున్న ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్ లో భాగంగా క్రాఫ్ట్స్, గేమ్స్, స్పోర్ట్స్, కంప్యూటర్ ట్రైనింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ లో శిక్షణ ఇవ్వడం జరుగుతున్నది. బీసీ గురుకుల పాఠశాలల ఆర్ సి ఓ స్వప్న, డిసిఓ సంధ్యారెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

# "స్వీయ గణన" విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 25 (వార్తా వేదిక సూర్య )

జనగణన-2027 ప్రక్రియలో భాగంగా, ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన "స్వీయ గణన" విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఒక కోరారు.శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో స్వీయ గణన ప్రక్రియ 26 ఏప్రిల్ 2026 నుండి 10 మే 2026 వరకు నిర్వహించడం జరుగుతుందని, జనగణనను ప్రభుత్వం రెండు దశల్లో నిర్వహిస్తున్నదని మొదటి విడత మే 11 నుండి జూన్ 9 వరకు హౌస్ లిస్టింగ్ హౌస్ సెన్సెస్ ఉంటుందని, ఫిబ్రవరి 9, 2027 నుండి ఫిబ్రవరి 28, 2027 వరకు జనగణన ఉంటుందని తెలిపారు. జనగణన ప్రక్రియలో భాగంగా ముఖ్యమైన స్వీయ గణనలో అందరూ భాగస్వాములు కావాలని,ప్రజలు తమ వివరాలను స్వయంగా అధికారిక వెబ్ పోర్టల్ ఒవ.ఎవఅంబం.స్త్రశీజ.ఱఅ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఒకరు 15 నుండి 20 నిమిషాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని,నమోదు పూర్తయ్యాక మొబైల్ లేదా ఇమెయిల్‌కు ఒక ఎస్.ఈ.ఐ.డి వస్తుందని, తర్వాత దశలో ఎన్యూమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు ఈ ఎస్. ఈ.ఐ.డి. చూపిస్తే నమోదు ధృవీకరణ పూర్తవుతుందని తెలిపారు. నల్గొండ జిల్లాలో 5 లక్షల 3 వేల గృహాలు ఉన్నాయని, 3729 హౌసింగ్ బ్లాక్ లను, 479 సర్కిల్లను ఏర్పాటు చేయడం జరిగిందని, 3179 గణకులను 531 మంది సూపర్వైజర్లను, 41 మంది చార్జి అధికారులను నియమించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి నిర్వహిస్తున్న ఈ జనగణన పూర్తిగా డిజిటల్ స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ విడత నిర్వహించే జనగణమనలో కులం వివరాలను కూడా నమోదు చేయడం జరుగుతుందని, జనగణనకు సంబంధించి నాలుగు విడతల శిక్షణ నిర్వహించాల్సి ఉండగా, ఇదివరకే రెండు విడతలు పూర్తి చేశామని ,ఏప్రిల్ 27 నుండి మూడో విడత శిక్షణ ఇవ్వనున్నామని వెల్లడించారు. స్వీయగణనపై విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రజలందరూ భాగస్వాములు అయ్యేలా చూడాలని, దీనివల్ల రాష్ట్ర, జాతీయ స్థాయిలో రూపొందించే పథకాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, సిపిఓ శ్రీనివాస్ నాయక్, డి పి ఆర్ ఓ యు. వెంకటేశ్వర్లు, హాజరయ్యారు.



# నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్

ఆదిలాబాద్ : (వార్తా వేదిక సూర్య )

జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న నలుగురిని జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. బేల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి వివరాలు వెల్లడించారు.సాంగిడి గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వారి వద్ద ఉన్న విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారిని సంఘటనా స్థలానికి పిలిపించి పరిశీలించగా విత్తనాలు నకిలివని తేలాయని పేర్కొన్నారు.గుజరాత్‌కు చెందిన నరేష్ క్రాప్ సైన్స్ కంపెనీకి పత్తి విత్తన ప్యాకెట్లను నకిలీ పత్తి విత్తనాలుగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. జిట్టావార్ కిషోర్ రెడ్డి, రక్తావర్ పవన్, నవగరే కునాల్, కుల్దీప్ టాక్రె ను అదుపులోకి తీసుకున్నామని, మరొకరు పరారీలో ఉన్నారని వివరించారు. వీరి వద్ద నుంచి రూ. 60 వేల నగదు, 150 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ కె ఫణిదర్, ఎస్సై మధు కృష్ణ ,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటీకి వ్యతిరేకంగా రైతుల దీక్షకు మద్దతు తెలిపిన జాతీయ కమిటీ సభ్యులు

రంగారెడ్డి : ఫార్మాసిటీకి వ్యతిరేకంగా జిల్లాలోని కురమిద్ద గ్రామం మర్లకుంట తండాలో రైతులు చేపట్టిన దీక్షలు 42 రోజులకు చేరుకున్నాయి. జాతీయ మహిళా రైతుల హక్కుల వేదిక సభ్యులు ఆశలత , పిలుపు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జనార్ధన్ , చైతన్య మహిళా సంఘం సభ్యులు గిరిజ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దీక్ష చేస్తున్న రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రైతులు మాట్లాడుతూ ఫార్మాసిటీ కోసం భూసేకరణను గత 8 ఏళ్లుగా వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, భట్టి విక్రమార్క, మల్‌రెడ్డి రంగా రెడ్డి పాదయాత్ర నిర్వహించి రైతులకు మద్దతు తెలిపి భూములు ఎట్టి పరిస్థితిలో ఫార్మాసిటీకి ఇవ్వవద్దని చెప్పారని గుర్తు చేశారు.అధికారం లోకి వస్తే భూసేకరణ రద్దు చేసి భూములు కాపాడుతామని, ఫార్మా సిటీ రద్దు చేస్తామని హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చాక భూమి ఇయ్యాల్సిందే లేకుంటే గుంజుకుంటాం అని పోలీసులని పెట్టి బేదిరిస్తున్నారని వాపోయారు. ఫార్మా సిటీ రైతుల ఉద్యమానికి తమ సంస్థల తరఫున పూర్తి మద్దతు ఉంటుందని సభ్యులు పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ సోదరుడు, మామకు హైకోర్టు నోటీసులు..!

ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరో షాక్. నానక్‌రామ్‌గూడ భూముల వ్యవహారంలో రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డికి, మామ సూదిని పద్మా రెడ్డికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కొండల్ రెడ్డి, పద్మా రెడ్డిలు అక్రమంగా సేల్ డీడ్ చేశారని దాఖలైన పిటీషన్ విచారణ సందర్భంగా.. భూమిపై స్టేటస్ కో విధిస్తూ రెవెన్యూ అధికారులకు నోటీసులిచ్చింది హైకోర్టు.

నానక్‌రామ్‌గూడలోని సర్వే నంబర్ 75/1లో 2.10 ఎకరాల నిషేధిత భూమిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి, మామ సూదిని పద్మారెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు రెవెన్యూ అధికారులు అనుమతించారు. సీఎం అండదండలు చూసుకొని ఆయన సోదరుడు, మామ పేరుతో రిజిస్ట్రేషన్‌కు అనుమతించడాన్ని సవాల్ చేస్తూ జనచైతన్య హౌసింగ్ లిమిటెడ్ సీఎండీ మడల సుధాకర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

శనివారం పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు విన్న అత్యున్నత ధర్మాసనం సదరు భూమిపై స్టేటస్ కో విధించింది. అంతేకాదు అధికారులతో పాటు కొండల్ రెడ్డికి, సూదిని పద్మారెడ్డికి వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను హై కోర్టు జూన్ 11వ తేదీకి వాయిదా వేసింది.



# విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ' బొట్ల నరేష్ ' ఎన్నిక



మోటకొండూరు,ఏప్రిల్ 24(వార్త వేధిక సూర్య): యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రిజిస్ట్రేషన్ నెం. 202/2010) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భువనగిరి ఎల్లమ్మ టెంపుల్ సమీపంలోని అచ్యుత్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన బోట్ల నరేష్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ మాతంగి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా మరియు భువనగిరి డివిజన్ కమిటీలను ప్రకటించారు.జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన బోట్ల నరేష్ ను రాష్ట్ర నాయకులు మరియు తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన బోట్ల నరేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ రంగంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# 26 నుంచి మే 10 వరకు జనగణనను నమోదు చేసుకోవాలి

మోత్కూరు, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య) : 2027 లో జరిగే జనాభా లెక్కలలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 60 మంది తో స్వీయ గణన (సెల్ఫ్ ఎనిమరేషన్ ) ప్రభుత్వం ఇచ్చే పోర్టల్ ద్వారా నమోదు చేసుకొనుటకు ఈనెల 26 నుండి మే10 వరకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపీడీవో బాలాజీ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలను సర్పంచులు వార్డు సభ్యులు సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, గ్రామ వివో అధ్యక్షులు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ షాప్ డీలర్స్ ,వివిధ ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగులు ,మాజీ ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, విలేజ్ అండ్ శానిటేషన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ,యువజన సంఘాలు పాల్గొంటారని ప్రజలు స్వీయ గణనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కేసీఆర్‌ను విమర్శిస్తే సహించం

మోత్కూరు, ఏప్రిల్ 25 ( వార్తా వేదిక సూర్య ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతిలో కీలుబొమ్మగా మారి మాజీ ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నిర్మాత బారాస అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావును మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శలు చేస్తే సహించేదే లేదని బారాస జిల్లా నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొణతం యాకుబ్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన క్రమంలో నిజామాబాద్ ఎంపీగా కెసిఆర్ తన కూతురైన కవితకు ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించి గెలిపించారని, 2019లో అదే ఎంపీగా పోటీ చేసిన కవిత ఓడిపోతే ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధిగా ఉన్న సమయంలో కోట్లకు పడిగెత్తిన కవిత రేవంత్ రెడ్డి మాయలో పడి కొత్త పార్టీ అవతారం ఎత్తారని, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కవిత కెసిఆర్ ను విమర్శించే ముందు ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు.

# బాల్య వివాహాలపై ప్రత్యేక అవగాహన సదస్సు

**- ముఖ్యఅతిథులు సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష హాజరు**



రామన్నపేట,ఏప్రిల్ 25 (వార్త వేదిక సూర్య) : రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామ పంచాయతీ ఆవరణంలో బాల్య వివాహాలపై ప్రత్యేక అవగాహన సదస్సు ను మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో సర్పంచ్ గర్దాసు విక్రమ్ అధ్యక్షతన ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా రామన్నపేట సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కం మండల న్యాయ సేవ అధి కార సంస్థ చైర్మన్ జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష లు అదేవిధంగా ప్యానెల్ అడ్వకేట్ ఏం. వెంకట్ రెడ్డి, బి.డేవిడ్ హాజరైనారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలు బాలికల హక్కులు మరియు చట్టపరమైన రక్షణల పై అవగాహన కల్పించారు. సమా జంలో ని ప్రతి ఒక్కరు కలిసి బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్క పౌరుడు బాల్య వివాహాలను అరికట్టడానికి ముందడుగు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండీ.రసూల్, ఎసిడిపివో సమీరా, సూపర్వైజర్ భాగ్య లక్ష్మి, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, పాల్గొన్నారు.

# కక్కిరేణి , రంగమ్మ గూడెం గ్రామ సమస్యలు పరిష్కరించాలి

**- జల్లెల పెంటయ్య సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు.**



రామన్నపేట,ఏప్రిల్ 25 (వార్త వేదిక సూర్య) రామన్నపేట మండలంలోని కక్కిరేణి , రంగమ్మ గూడెం గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఉమా శంకర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య మాట్లాడుతూ గ్రామంలో అనేక సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని, గ్రామానికి రావాలంటే నలు దిక్కుల రోడ్లు గుంతల మయమై ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పాలకులు అధికారులు స్పందించి బీటీ రోడ్లు వేయాలని అలాగే మిషన్ భగీరథ ట్యాంక్ మెట్లు విరిగిపోయినయని సిపిఎం పాదయాత్ర సందర్భంగా పరిశీలించి అధికారులతో మాట్లాడిన మాటలు తప్ప నేటికి ఆచరణ కాలేదని ట్యాంక్ ని సిబ్బంది శుభ్రపరిచే పరిస్థితి లేదని గ్రామపంచాయతీ సిబ్బంది ట్యాంక్ ని ఎక్కాలంటే ప్రాణాలతో చెలగాటం చేయాల్సి వస్తుందని వెంటనే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని , కక్కిరేణి , రంగమ్మ గూడెం దారిలో ఉన్న ఈదులగుపై కల్వర్టు నిర్మించాలని , మార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వెంటనే ఫీల్ లోకి వెళ్లి సర్వే చేసి కొలతలు తీసుకున్నారు తప్ప ఇప్పటికీ పరిష్కారం కాలేదని, ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నారం రూట్ లో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి నిర్మాణం జరిగి 7 సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదని , మార్కెట్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ను వేగవంతం చేయాలని అధికారులను కోరారు.. అలాగే రామన్నపేట ను నియోజకవర్గ కేంద్రంగా పునరుద్ధరించాలని అన్ని గ్రామాల సర్పంచ్ ఉపాలకవర్గం తీర్మానం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వేముల సైదులు గ్రామ శాఖ కార్యదర్శి కన్నెబోయిన యాదయ్య , నరసింహ , వెంకన్న ,సైదులు , లింగుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరాన్ని చేనేత, కార్మికులు ఈసద్వినియోగం చేసుకోవాలి

**- మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న**

మోత్కూరు, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య ): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య కోరారు. శనివారం స్థానిక చేనేత సహకార సంఘం కార్యాలయంలో ప్రజాపాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న చితం మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత కార్మికు లు ఎంతో ఓర్పుతో శ్రమించి బట్టలు నేస్తూ ప్రజలకు అందిస్తున్నా తీరును రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారి ఆరోగ్య భద్రత దృష్టిలో పెట్టుకొని నేతా కార్మికులకు ఉచితమైన వైద్య నిర్వహి ంచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు జల్ది రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశిక ంటి లక్ష్మీ నర్సయ్య, చేనేత సహకార సంఘం మేనేజర్ వేముల నర్సయ్య, స్థానిక నాయకులు పోచం కన్నయ్య, వంగరి రాములు, పసునూరి యాదయ్య, కూరపాటి రాములు చెంచు లక్ష్మ య్య కొక్కుల సత్యనారాయణ, జల్ది సోమయ్య రేగోటి సత్యనారాయణ , శ్రీనివాస్ డోర్న గోపయ్య ,డి ఎం హెచ్ ఓ డాక్టర్ సుమన్ కళ్యాణ్, ఏడిఏ.సత్యనారాయణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హేమంత్, సూపర్వైజర్లు,ల్యాబ్ టెక్నీషియన్లు, ఎమ్మెల్ హెచ్ పి లు, ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.





# పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

**- సిపిఎం**

మోత్కూరు, ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య ): మోత్కూరు పట్టణంలోని నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి,మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పట్టణ సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ సతీష్ కుమార్, చైర్ పర్సన్ గడ్డం స్వప్న లకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా బృందావన్ కాలనీలో చెత్త చేరి దుర్వాసనతో కాల్వ పక్కన ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆ కాల్వను శుభ్రపరిచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అంబేద్కర్ చౌరస్తా నుండి అన్నెపు వాడకు వరకు వెళ్లే రోడ్డు వెడల్పు చేసి సీసీ రోడ్డు వేయాలని, రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు, వృధ్యాప్య, వింతంతు, వికలాంగుల గీత, నేత కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలోని కొండగడప గ్రామంలో మురికి కాల్వ నిర్మాణం కోసం కొన్ని కట్టడాలను కూల్చి వదిలేశారని వెంటనే కాల్వ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి రాచకొండ రాములమ్మ, మండల కమిటీ సభ్యులు కురిమేటి యాదయ్య, కూరపాటి రాములు, కందుకూరి నర్సింహ్మా ,గుండు లక్ష్మి కందుకూరి అంజమ్మ, లోడే నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.



# మహేశ్వరంలో హిందువుల ఐక్యత

- హిందుత్వం భారత జీవనానికి ఆధారం
- చత్రపతి శివాజీ యువసేన భాగ్యనగర్ అధ్యక్షులు ఆధ్యాత్మికవేత్త శ్రీమాన్ యోగేష్ ప్రభు స్వామీజీ

మహేశ్వరం ఏప్రిల్ 25 (వార్త వేదిక సూర్య) : హిందువులను ఐక్యతపరిచేందుకే హిందూ సమ్మేళనాలను నిర్వహించడం జరుగుతుందని చత్రపతి శివాజీ యువసేన భాగ్యనగర్ అధ్యక్షులు ఆధ్యాత్మికవేత్త సంస్కార వికాస్ భాగ్యనగర్ కోఆర్డినేటర్ శ్రీమాన్ యోగేష్ ప్రభు స్వామీజీ తెలిపారు. శనివారం శివగంగ దేవాలయం వద్ద జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ సంస్థ ఏర్పాటు 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందువుల ఐక్యతకు కృషి చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నేటి కాలంలో అనేక సవాలను ఎదుర్కొనేందుకు హిందువుల ఐక్యత ఎంతైనా అవసరం ఉందని ఆయన తెలిపారు హిందూ సమాజం పట్ల గౌరవభావం ఏకాత్మత భావన స్వధర్మం పట్ల అంకితభావం సేవ గుణం వంటి వాటిని వికసింప







చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వా మ్యం కావాలని ఆయన కోరారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం దేశంలోని భారతీయు లను ఏకం చేసేందుకు కృషి చేస్తున్నందుకు గర్విస్తున్నానని ఆయన పేర్కొన్నారు. సంతన ధర్మంలో హిందువులు ముఖ్య భూమికను పోషించాలని ఆయన సూచించారు. హిందువులు రాజకీయాలకతీతంగా సంఘటితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పునరుద్ఘాటించారు. హిందువులలో దేశభక్తి నిర్మాణం కావడానికి అనేక హిందూ సమ్మేళనాలను నిర్వహించాలని సూచించారు. హిందువులలో ఐక్యత లేకపోవడం వలన హిందువులపై రకరకాలుగా దాడులను చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. హిందువులు ఏకతాటిపైకి వచ్చి హిందువుల యొక్క ఖ్యాతిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

# తుమ్మలూరులోని పెండింగ్ రోడ్డు పనులపై అధికారుల పర్యటన

- సర్పంచ్ కృషితో ముందుకు కదిలిన రోడ్డు సమస్య

మహేశ్వరం ఏప్రిల్ 25 (వార్త వేదిక సూర్య) : మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామంలో సుమారు 4 సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ సర్పంచ్ తుమ్మటి అండాలు కృష్ణ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారుగత కొంతకాలంగా ఆర్ ఢబి అధికారులు, మిషన్ భగీరథ అధికారులు మరియు రోడ్డు కాంట్రాక్టర్‌తో సమన్వయం చేస్తూ, పలుమార్లు ప్రతినిధులతో కలిసి అధికారులను కలసి రిప్రెసెంటేషన్లు ఇవ్వడం జరిగింది.ఈ కృషికి స్పందించిన అధికారుల బృందం ఈరోజు తుమ్మలూరు గ్రామాన్ని సందర్శించి, పెండింగ్ పనులపై స్థల పరిశీలన నిర్వహించారు.రోడ్డుకు మధ్యలో ఉన్న కల్వర్ట్ నిర్మాణాన్ని ముందుగా పూర్తి చేసి, అనంతరం మిగిలిన రోడ్డు పనులను పూర్తి చేస్తామని ఆర్ ఢబి అధికారులు స్పష్టం చేశారు.సర్పంచ్ తుమ్మటి అండాలు కృష్ణ యాదవ్, ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామ ప్రజలు ఎన్నో రోజులుగా ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యని పరిష్కారం చేయడం కోసం ఈరోజు ధికారుల బృందంతో కలిసి పర్యటించటం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అండాలు కృష్ణ యాదవ్,, ఆర్ ఢబి అధికారులు, మిషన్ భగీరథ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి సంపుటి : 1 సంచిక : 330
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి ఆదివారం, ఏప్రిల్ 26, 2026

# వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని విజయవంతం చేసుకుందాం

- సంతోష్ కుమార్ చారి
- నేడు మొయినాబాద్ లో సద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మహోత్సవం..
- సృష్టికి మూలం విశ్వకర్మ

**మొయినాబాద్ మున్సిపాలిటీ ఏప్రిల్ 25 ( వార్త వేదిక సూర్య ) :** సద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మొయినాబాద్ మండల విశ్వకర్మ అధ్యక్షుడు సంతోష్ కుమార్ గౌరవాధ్యక్షులు వడ్ల నరసింహ చారి పేర్కొన్నారు. నేడు ఆదివారము మొయినాబాద్ మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి భక్తులకు ఆహ్వానం పలికారు ఈ సందర్భంగా పలు గ్రామాలను సందర్శించిన వారు మాట్లాడుతూ సద్గురు శ్రీ మాధవి రాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ల వారి ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం మండల కేంద్రంలోని దేవాలయంలో వేద పండితులు పూజారుల మంత్రచారమధ్య విద్యార్థుల నిర్వహించ బడుతుందని పేర్కొన్నారు అనంతరం 12 గంటలకు తీర్థ ప్రసాదములు అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. మీ కార్యక్రమం విశ్వకర్మ మండల విశ్వబ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో అలంపురి కళావతి మోనాచారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# రెడ్ క్రాస్ భవన నిర్మాణానికి స్థల వితరణ. రూ 10 లక్షల ప్లాట్ రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసిన ఎన్నారై నారాయణ దంపతులు



**మోత్కూరు, ఏప్రిల్ 25 (వార్త వేదిక సూర్య ) :** ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ మోత్కూరు శాఖ భవన నిర్మాణానికి స్థానిక ఎస్ బి ఐ బ్యాంక్ వెనక శ్రీ భక్త మార్కండేయ ఆలయ సమీపంలో సుమారు రూ.10 లక్షల విలువ గల 104 గజాల తన సొంత స్థలాన్ని ఎన్నారై పోచం నారాయణ, హేమలత దంపతులు శనివారం రిజిస్ట్రేషన్ చేసి రిజిస్ట్రేషన్ పత్రాలు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహ్మా రెడ్డి, మోత్కూరు శాఖ అధ్యక్షులు ఓ సత్యనాథ్ లకు స్వయంగా అందజేశారు. రెడ్ క్రాస్ సంస్థ చేస్తున్న కార్యక్రమాలలో తాను భాగస్వామి కావాలనే ఉద్దేశ్యంతో స్థలాన్ని వితరణగా ఇచ్చినట్లు తెలిపారు. భవన నిర్మాణం కోసం స్థలాన్ని ఇచ్చిన దాత నారాయణ దంపతులను జిల్లా చైర్మన్ లక్ష్మి నర్సింహ్మా రెడ్డి అభినందించారు.. ఈ సందర్భంగా మోత్కూరు రెడ్ క్రాస్ శాఖ తరపున దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ సభ్యుడు ఎం డి అహ్మద్ ఉన్నారు.

# మే 1వ తేదీ నుండి 11 వరకు పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ తరగతులు

**- పాలిటెక్నికల్ కాలేజ్ ప్రిన్సిపల్ నాగరాజ్**

**మహేశ్వరం ఏప్రిల్ 25 వార్త వేదిక సూర్య**
మహేశ్వరం : పాలిటెక్నిక్ ఎగ్జామ్స్ మే 13న ఉండడంతో, మహేశ్వరం మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కాలేజీలో మే 1 నుండి 11వ తేదీ వరకు ఎగ్జామ్స్ సంబంధించిన ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ పి నాగరాజు, తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణ తరగతులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉంటాయి, అలాగే పాలీసెట్ 2026 హాల్ టికెట్ పొందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు, పాలిటెక్నిక్ అడ్మిషన్ల గురించి హెచ్ సి ఎల్ హెల్ప్ లైన్ సెంటర్ కూడా ఈ సంవత్సరం నుండి ఇక్కడ నిర్వహించబడుతుంది, వివరాలకు సంప్రదించవలసిన నెంబర్స్,8465039668,9490120175, సంప్రదించవచ్చు.







# ఉపాధి హామీ పనులు ఎమ్మెల్యే అడ్డుకోవడం సరికాదు

**మోత్కూరు, ఏప్రిల్ 25 (వార్తా వేదిక సూర్య);** మండలంలోని పాలడుగు, పనకబండ రాగిబావి గ్రామాలలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను సిసి రోడ్ల నిర్మాణలకు స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ అడ్డుకోవడం సరైన నిర్ణయం కాదని భాజపా మండల అధ్యక్షులు గూదే మధుసూదన్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.

# చిన్నపిల్లలను బడికి పంపించాలి

- మున్సిపల్ అధికారి సంధ్యారాణి

**మొయినాబాద్ ఏప్రిల్ 25 (వార్తావేదిక సూర్య)**
చిన్నపిల్లలను బడికి పంపించి విద్య విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా తల్లిదండ్రులు చూడాలని మైనా బాద్ మున్సిపల్ అధికారి సంధ్యారాణి అన్నారు శనివారము మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ అంగన్వాడి రెండవ కేంద్రంలో అంగన్వాడి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ అధికారి సంధ్యారాణి తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని అన్నారు ఇందుకోసం పిల్లలను బడికి పంపించాలని సూచించారు విద్యావంతులుగా విజ్ఞానవంతులుగా ఎదుగుతారని అన్నారు విద్యతోనే అన్ని అభివృద్ధి చెందుతాయని తెలిపారు తెలియని వాడు వింత పశువు అని సామెత ఉందని దానిని తెలుసుకున్న ప్రతి ఒక్కరు పిల్లలను చదివించక ఉండాలని తెలిపారు అంగన్వాడి కేంద్రాలలో చిన్నపిల్లలకు పోస్ట్ కారం తో పాటు నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయం అన్నారు ఈ కార్యక్రమంలో సరిత సుకన్య అంగన్వాడి ఉపాధ్యాయురాలు కవిత ఆశా వర్కర్లు పిల్లల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉదయ్ గౌడ్‌కు సుదగాని హరిశంకర్ పరామర్శ



**మోటకొండూరు/ ఏప్రిల్ 25 (వార్తా వేదిక సూర్య);** గౌడ సంఘం యువజన నాయకులు పంతంగి ఉదయ్ కిరణ్ గౌడ్ తాత పంతంగి మస్తాన్ గౌడ్ ఇటీవల మృతి చెందగా మస్తాన్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సుదగాని ఫౌండేషన్ చైర్మన్ సుదగాని హరి శంకర్ గౌడ్. అనంతరం ఉదయ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మోటకొండూరు సర్పంచ్ జయమ్మ శ్రీనివాస్, ఉపసర్పంచ్ వంగాల నికిత మహేందర్ గౌడ్, సుదగాని ఉదయ కిరణ్ గౌడ్, బత్తిని వెంకటేష్ గౌడ్, చందేపల్లి ఉప సర్పంచ్ ఏనుగు అంజిరెడ్డి, హరినాథ్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్, శంకరాచారి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్‌లో చేతులు విరక్కు పోయి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



**మోత్కూరు, ఏప్రిల్ 25 (వార్త వేదిక సూర్య ):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పరుపులు, ఫర్నిచర్ దుకాణం నిర్వహిస్తున్న యజమాని పత్తి ఒడిసె సమయంలో ప్రమాదవశాత్తు చేతులు మిషన్ లో ఇరుక్కు పోయి-ంత్రీవంగా గాయపడి కోమలోకి వెళ్ళాడు. స్థానికులు బందువులు తెలిపిన వివరాల ప్రకారం. ఇస్మాయిల్ (58 ) గత 20 ఏళ్లుగా పోతాయగడ్డ ప్రాంతంలో దుకాణం పరుపులు, ఫర్నిచర్ నిర్వహిస్తూ జీవనం గడుపుతున్నారు. వృత్తిలో భాగంగా ప్రతి రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం పరుపు కోసం పత్తిని ఒడిసె సమయంలో మిషన్ కలియబెడుతూ ప్రమాదవశాత్తు చేతులు ఇరుక్కు పోయి కట్ అయ్యి అపస్మారక స్థితిలో వెళ్లిపోయాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కు సమాచారం ఇవ్వడంతో 108 వాహనం అక్కడి చేరుకొని 108 అంబులెన్స్ లో స్థానిక ఆస్పత్రికి తరలించగా, డాక్టర్ సూచన మేరకు భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు ఇస్మాయిల్ పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారని మృతుని బంధువులు తెలిపారు. మృతునికి భార్య పెళ్లయిన కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనను పోలీసులు సందర్శించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**